ఏడాదిన్నరగా కొనసాగుతున్న యుద్ధం ఇప్పట్లో ముగిసే ఛాయలు కనిపించడంలేదు. పైగా బెలారస్‌కు రష్యా అణ్వాయుధాలను తరలించడంపైఇపుడు సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి. హీరోషిమా, నాగసాకి నగరాలపై విడిచిన బాంబుల విషాదం ఇప్పటికీ ప్రపంచం మరువలేకుండా ఉంది. అదే కనుక మళ్లీ రష్యా పునరావృతంచేస్తే మరో భయానక విషాదం నెలకొంటుందన్నది నిర్వివాదాంశం. ఇపుడు బెలారస్‌కు వ్యూహాత్మక అణుసామగ్రిని మొత్తంపంపిణీచేసి అక్కడ మోహరింప చేయడంపైనే అటు బెలారస్ ఇటు రష్యా కేవలం ఉక్రెయిన్ కోసమేనని చెప్పకపోయినా పరోక్షంగా అందుకేనన్నది మాత్రం అందరికీ తెలిసిందే. అణుసంపన్న దేశాల్లో ఒక్కటిగా ఉన్న రష్యా అణుఒప్పందం ఉల్లంఘిస్తే పెనువినాశనమే జరుగుతుంది. అసలు బెలారస్‌లోనే ఎందుకు మోహరించాల్సివస్తోంది అంటేబెలారస్ రష్యాకు అత్యంత కీలకమైన మిత్రదేశంగా ఉంది. రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దండయాత్రను ప్రారంభించేముందు బెలారస్‌ను లాంచ్‌ప్యాడ్‌గా వినియోగించింది. ఇపుడు న్యూక్లియర్ అణుయుద్ధ సామగ్రిని పూర్తిస్థాయిలో బెలారస్‌కు చేర్చడం వెనుక ఆంతర్యం కూడా ఇదేనని చెప్పవచ్చు. వేసవి చివరినాటికే అణుసామాగ్రిని మొత్తం చేరుస్తామని ప్రకటిస్తున్న రష్యా తమ సార్వభౌమత్వానికి భంగంకలిగించే ఏ చర్యనైనా ప్రతిఘటించేందుకు అవసరమైతే అణుదాడులు కూడా చేసేందుకు వెనుకాడబోమని చెపుతున్నారు. కేవలం నియంత్రణకోసమే కాకుండా వ్యూహాత్మకంగా ఓడించే ఆలోచనలో ఉన్న ఎవరికైనాసరే మేమంటే ఏమిటో తెలిసివచ్చేందుకు చేపట్టే చర్యగా కూడా భావిస్తామని సాక్షాత్తూ పుతిన్ చేస్తున్న వ్యాఖ్యలను బట్టిచూస్తుంటే ఏసమయంలో అయినా అణుయుద్ధానికి వెనుకాడబోమని చెపుతున్నట్లుగా ఉంది.రష్యా జాతీయహోదాకు, భద్రతకు తీవ్రమైన ముప్పు వస్తేనే అణుచర్యలకు ప్రాధాన్యతనిస్తామని చెపుతూవస్తున్నారు. వ్యూహాత్మక అణ్వాయుధాలు అనేవి చిన్న చిన్న అణువార్‌హెడ్‌లు యుద్ధరంగంలో పరిమిత దాడులకోసంఉపయోగిస్తారు. రేడియోధార్మికప్రభావం విస్తరించకుండా పరిమిత ప్రాంతానికి మాత్రమే వీటి ప్రభావం ఉంటుంది. అణుధార్మిక ప్రభావంతో ఎంతటి వినాశనాన్ని అయినా కళ్లారా చూడవచ్చు. 1945లో హీరోషిమాపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు బరువు 15 వేల టన్నులు అని చెపుతుంటారు. ఓవైపు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంపోసా అధ్యక్షతన మధ్యవర్తిత్వ చర్చలు ప్రారంభమయ్యాయి. ఆదేశ ప్రతినిధి బృందం ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న తరుణంలోనే క్షిపణులు మోతమోగాయి. ఉక్రెయిన్ భౌగోళిక రూపాన్నే ధ్వంసం చేసిన రష్యాతో ఇక చర్చలేమిటని మరోపక్క జెలెన్‌స్కీ చెపుతున్నారు. ఆదేశాలతో దౌత్యబంధాలను కూడా తెగతెంపులు చేసుకుంటేనే రష్యా దారికి వస్తుందని, ముందు ఉక్రెయిన్‌పై దండయాత్రనునిలిపివేసే చర్యలు చేపట్టాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు కోరుతున్నారు. ఏదిఎలా ఉన్నా బెలారస్ స్థావరంగా తరలిస్తున్న అణుసామగ్రి ఎవరిపై ప్రయోగించడానికి? ఉక్రెయిన్‌పైన ప్రయోగిస్తుందా? పాశ్చాత్యదేశాలను హెచ్చరించేందుకు ముందస్తు చర్యలుగా ఈ అణుసామగ్రి తరలిస్తున్నారా? అన్నది ఇపుడు ప్రపంచదేశాలకు అంతుబట్టకుండా ఉంది. ఇప్పటికే ఉక్రెయిన్‌లో సగానికిపైగా భూభాగాలను ఆక్రమించిన రష్యా పూర్తిస్థాయిలో ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవడంద్వారా పాశ్చాత్యదేశాలకు ఒక హెచ్చరికలాంటిది పంపించాలన్న లక్ష్యంతో ఉన్నారు.ఓవక్క నాటోదేశాలు ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్నాయి. రక్షణపరంగా ఆయుధసామాగ్రిని సరఫరాచేస్తున్నాయి. వాటిలోఅమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీదేశాలు ముందువరుసలో ఉన్నాయి. కొన్ని దేశాలైతే ఉక్రెయిన్ సైనికులకు తమ ఆయుధాలపై శిక్షణఇచ్చి మరీ రష్యా దాడులను ప్రతిఘటించే దిశగా ఆదేశ సైన్యాన్ని సమాయత్తం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌పై దాడులకు రష్యా అధ్యక్షుడు ప్రైవేటుసైన్యాన్ని సైతం వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో వాగ్నార్ ముఠా ముందువరుసలో ఉంటున్నది. అత్యంత కిరాతకంగా తమకు నచ్చినరీతిలో యుద్ధతంత్రాలను వినియోగించి ప్రత్యర్థులను భీతిల్లేలా చేయడం వీటికి వెన్నతోపెట్టిన విద్య. వీటన్నింటినీ ప్రతిఘటిస్తూ వస్తున్న ఉక్రెయిన్‌ను తమ దారిలోకి తెచ్చుకునేందుకే ఇపుడు రష్యా పరిమిత శక్తిసామర్థ్యం ఉన్నఅణ్వాయుధాలను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు నిఘావర్గాలు నివేదికలు అందిస్తున్నాయి. గతంలో టర్కీ మధ్యవర్తిత్వానికి ముందుకువచ్చింది. ఇపుడు బ్రిక్స్ దేశంలో సభ్యదేశం అయిన దక్షిణాఫ్రికా మధ్యవర్తిత్వానికి ముందుకువస్తోంది.అయినా కూడా యుద్ధకాండ ఎక్కడా ఆగుతున్నట్లు లేదు సరికదా మరింతగా విజృంభించి దాడులు జరుగుతున్నాయి. తమ దేశానికి దక్షిణాన అన్నివైపులా తమ బలగాలు రెండుకిలోమీటర్లమేర విస్తరించాయని ఉక్రెయిన్ చెపుతోంది. రష్యా ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ మళ్లీ స్వాధీనం చేసుకున్నామని చెపుతుంటే మరోపక్క పుతిన్ ఉక్రెయిన్‌వద్ద ఆయుధాలు నిండుకున్నాయని, పశ్చిమదేశాలిచ్చే సాయంతో ఎంతోకాలం పోరాడలేదని,ప్రతిదాడులు చేయడం ఇక కల్లఅని పుతిన్ చెపుతున్నారు.ఏదిఎలా ఉన్నా అణువార్‌హెడ్‌లు అంటూ ఉపయోగిస్తే ఆ చుట్టుపక్కల దేశాలన్నింటికీకూడా ఈ విధ్వంసం ఛాయలు అలుముకుంటాయి.వాటిప్రభావం ఆదేశ ప్రజల ఆరోగ్య,మానసికస్థితులపై తీవ్రప్రభావం చూపిస్తుంది.విధ్వంసానికి మారుపేరుగా నిలిచే అణ్వాయుధాలు పరిమిత శక్తివంతమే అయినా రేడియోధార్మికశక్తివల్ల పెనువినాశనమే జరుగుతుంది.అందువల్లరష్యా బెలారస్‌కు చేరవేస్తున్న ఈ ఆయుధాలపై స్పష్టమైన ప్రకటనచేయాలి. అణుప్రయోగాలపై జరిగిన ఒప్పందానికి కట్టుబడి ఉంటుందాలేదా అనేదికూడా తేటతెల్లంకావాలి. లేనిపక్షంలో యుద్ధకాండలో ఆరితేరిన పుతిన్ తనలక్ష్యం నెరవేరేందుకు ఏ స్థాయికైనా వెళ్లిపోగలరన్నది మాత్రంనిర్వివాదాంశం. ●



పుతిన్

# విధ్వంస రచనకు స్వస్తివాక్యం పలకాలి



సుంకవల్లి సత్తిరాజు

స్వేచ్ఛను హరించి, జీవశ్చవాల్లా బతుకీడ్చమనడం, పరులకు పాదాక్రాంతమవడం ఆత్మహత్యా సదృశ్యం. వికృతంగా మారిన మానవ ప్రవృత్తి మానవాళినిమరణ శయ్యపైన పవళించడానికి ఆహ్వానిస్తున్నది. అహంకారం వలన ప్రబలిన నియంతృత్వం ఇతరుల స్వేచ్ఛకు సమాధి కడుతున్నది. ఇతరులను పీడించుకుతిని, ఇతరుల స్వేచ్ఛను హరించి పైశాచికానందం పొందడం విపరీతమైన మానసిక రుగ్మతల వలన ఏర్పడిన ఒక భయంకరమైన ఉన్మాదం. నియంతృత్వం,సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదం వంటి లక్షణాలు ఈకోవకు చెందినవే. కనీస మానవత్వాన్ని వదిలేసి, మనుషులను మరబొమ్మలుగా ఆడిస్తూ,పీడిస్తూ చరిత్రలో అధమస్థానం సంపాదించి, భావితరాల దృష్టిలో చులకన కావడంలో ఔచిత్యమేమిటో అవగతం కావడం లేదు. యుద్ధాలతో, ఉన్మాదంతో సాధించేదేమిటి? చరిత్రను రుధిరంతో తడిపి, మానవ జీవితాలను అహంకార జ్వాలలతో భస్మీపటలం చేసి విజేతలు కాగలరా? అలాంటి ఉన్మాదాన్ని ప్రపంచం అంగీకరించగలదా?చరిత్ర క్షమించగలదా? రెండు ప్రపంచ యుద్ధాలు, వాటి ముందు, వెనుక జరిగిన అనేక యుద్ధోన్మాద సంఘటనలు, వాటి పరిణామాలను చరిత్ర కీర్తించిందా? జీవించినంతకాలం నరమేథం కొనసాగించి, అత్యంత క్రూరంగా ప్రవర్తించిన నియంతలను ప్రపంచ గౌరవించిందా? చరిత్ర నేర్పిన పాఠాల నుండి నేటికీ గుణపాఠాలు నేర్చుకోలేక ప్రపంచం భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమని బతుకీడ్చడం ఆధునిక నాగరికతను సవాల్ చేస్తున్నది. ప్రపంచంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగాఉన్నాయి. సమస్య పరిష్కారానికి ఎన్నో దారులున్నాయి. సమస్యలను పరిష్కరించుకోకుండా ప్రపంచ దేశాలన్నీ స్వార్థ ప్రయోజనాల కోసం దగ్గరదారులు వెతుక్కుంటున్నాయి.ఎదురించిన దేశాలను బెదిరించడం, ఆంక్షలు విధించడం వంటి చేష్టలతో ఇతర దేశాలపై పెత్తనం చెలాయించాలనే ధోరణితో అగ్రరాజ్యాలు, సామ్రాజ్యవాదంతో మరికొన్ని దేశాలు, తమ వ్యాపార సామ్రాజ్యాల నిర్మాణం కోసం ఇంకొన్ని దేశాలు నిరంతరం తపిస్తున్నాయి. స్వీయ ప్రయోజనార్థం జపిస్తున్నాయి. ప్రపంచాన్ని మింగేసే కాలుష్యం, వాతావరణం, పర్యావరణ సమస్యలను పట్టించుకోకుండా ఆయుధ సంపత్తితో, ఆర్థిక బలిమితో రెచ్చిపోయే అగ్రరాజ్యాల హుంకార స్వరాలు ప్రపంచాన్ని కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్తమాన ప్రపంచంలో చాలామంది ప్రజలకు జీవించడానికి సరైన వసతులులేవు. తినడానికి సరైన తిండి, తాగడానికి సరైన నీరు లేక ఈనాటికీ చాలామంది ప్రజలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.బాల కార్మిక వ్యవస్థ ఇంకా మనుగడలోనే ఉంది. ఆర్థిక అంతరాలు అపరిష్కృతంగా ఉన్నాయి. అందరికీ విద్య గగన కుసుమంలా మారింది. బాలికావిద్య అంతంత మాత్రంగానే ఉంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, అక్రమ మానవ రవాణా, లైంగిక హింస వంటి పలు సమస్యలు ప్రపంచాన్ని వేధిస్తుంటే వీటి పరిష్కారానికి చొరవ చూపకుండా, యుద్ధోన్మాదంతో చెలరేగిపోవడం సామ్రాజ్య విస్తరణ కోసం పావులు కదుపుతూనిరంతరం కొట్లాడుకోవడం అత్యంత దారుణం. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు చిన్న చిన్న గొడవలతోనే ప్రారంభమై, పలు దేశాల మధ్య కార్చిచ్చును రగిలించాయి. మహా సంగ్రామాలకు తెరలేపాయి. గతం కళ్లముందు గోచరిస్తున్నా జరిగిన వినాశనం నుండి గుణపాఠాలు నేర్చుకోకుండా పలు దేశాలు ఇంకా యుద్ధకాంక్షతో పేట్రేగిపోవడం, గత యుద్ధ చరిత్రను పునరావృతం చేయడానికి తపించడం గర్హనీయం.గతంలో జరిగిన రెండు మహాసంగ్రామాల వలన కోట్లాది మంది ప్రజలు, సైనికులు సంహరించబడ్డారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వెల్లువెత్తిన నేటి తరుణంలో అణ్వస్త్ర ప్రపంచం ఆవిర్భవించిన నేపథ్యంలో మూడో ప్రపంచ సంగ్రామం జరిగితే మానవజాతి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. విజ్ఞానం పెరిగినా, ప్రపంచంలో నేటికీ అనేక రోగాలతో ప్రజలు జీవశ్చవాలుగా బతుకీడ్చుతున్నారు. జీవించే హక్కును కాపాడలేని ప్రపంచ దేశాలు యుద్ధాల పేరుతో ప్రజలను సంహరించడం ఒక మానసిక ఉన్మాదంగా భావించకతప్పదు.ద్విధృవ ప్రపంచం అంతరించి, ఏకధృవ ప్రపంచం ఆవిర్భవించినా, అమెరికా అగ్రరాజ్య



హోదాను అనుభవిస్తున్నా చైనా లాంటి దేశాలు అమెరికా అగ్రరాజ్యాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ తనే ఏకైక అగ్రరాజ్యంగా వెలిగిపోవాలనే తపనతో తన రాజకీయ వ్యాపార వ్యూహాలకు పదును పెడుతూ తమ శత్రుదేశాలను వేధిస్తూ, ఉగ్రవాదులకు స్వర్గధామంలా మారిన పాక్‌వంటి దేశాలకు అన్ని విధాలుగా సహకరిస్తూ భారత్‌కు ఐ.రా.స భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం దక్కకుండా తనకున్న 'వీటో'తో భారతదేశానికి వీటో లేకుండా కొర్రీలు పెడుతున్న డ్రాగన్‌ను కట్టడి చేయడంలో ప్రపంచ దేశాలు విఫలమవుతూనే ఉన్నాయి. జనాభాపరంగా, అణ్వాయుధపరంగా అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ వీటో విషయంలో వెనుకబడిపోవడం దారుణం.భారత్ భూభాగంలో కూడా చైనా ఆక్రమణలు మొదలెట్టింది. ప్రపంచమంతా భారత సరిహద్దును అంగీకరించిందని నమ్మిన భారత్‌కు చైనా అతిక్రమణలు బాధించాయి. 'కర్ర ఉన్న వాడిదే బర్రె' అనే సంగతిని భారత్ మరచిపోవడం,చైనాను గుడ్డిగా నమ్మడం వలన భారత్ భారీగా నష్టపోయింది. ప్రజాస్వామ్యబద్ధంగా నైతిక సూత్రాలతో, శాంతి వచనాలతో మనుగడ సాగించే భారత్‌కు, నియంతృత్వపోకడలతో రెచ్చిపోయే చైనాకు మధ్య సారూప్యతను ఊహించుకోవడం హాస్యాస్పదం. బలవంతంగా ఇతర ప్రాంతాలను ఆక్రమించుకున్న చైనాకు, రాజులను అంతం చేయకుండా రాజ్యాలను అంతం చేసిన భారత్ శాంతియుతవిధానాలకు హస్తిమశకాంతమంత వ్యత్యాసముంది.భారత్, చైనా, మయన్మార్‌లమధ్య కుదిరిన పంచశీల ఒప్పందానికి ఆరున్నర దశాబ్దాలు దాటింది. చైనాతో సత్సంబంధాలు మాత్రం నెలకొనలేదు.భారతదేశానికి, ఇతర దేశాలకు విదేశాంగ విధానాల్లో చాలా వ్యత్యాసముంది. అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడి ఉండడం కూడా భారత్‌కు ప్రపంచంలో విశ్వసనీయత సంపాదించి పెట్టింది.అదే సందర్భంలో భారతదేశ శాంతివచనాలు పరాయి పాలకులు అసమర్థతగా భావించారు. అయితే క్రమేపీ భారతదేశం కూడా ఈ వాస్తవాన్నిగ్రహించి దూకుడుగా ముందుకు సాగుతున్న మాట వాస్తవం.మనదేశ ప్రయోజనాలను సైతం పక్కనబెట్టి, బలహీన దేశాల పట్ల భారతదేశం చూపించిన ఔదార్యం చరిత్రకు అందని త్యాగాల సమాహారం. భారతదేశం అణ్వస్త్ర దేశమైనప్పటికీ, మొదటగా తాను ఏదేశంపైనా అణ్వస్త్రాలను ప్రయోగించబోమని భారత్ స్వీయనియంత్రణ విధించుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సాహిస్తూ అడుగడుగునా భారత్ భద్రతకు ముప్పుగా మారిన పాకిస్థాన్‌తో ఎన్నోశాంతి ఒప్పందాలు కుదుర్చుకుంది. పాక్ పాలకులు అన్ని ఒప్పందాలను కాలరాస్తూ భారత్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పంజాబ్,కాశ్మీర్‌లలో పాక్ దురాగతాలను చరిత్ర మరవదు.జిహాద్ పేరుతో ఉగ్రవాదులను తయారు చేసి ప్రజల ధన,మాన ప్రాణాలతో చెలగాటమాడిన పాక్‌కు భారత ప్రభుత్వం ఇటీవల కాలంలో సరైన గుణపాఠాలే నేర్పింది. భారత్‌తో పాక్ శతృత్వం కొనసాగించడం, చైనాతో దాయాది దేశం గాఢమైన స్నేహం పాము పడగనీడలో సేదతీరడం లాంటిది. భారత్‌తో శతృత్వం పెట్టుకుని, దశాబ్దాల తరబడి భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తూ చైనాతో అంటకాగడం వలన పాక్‌కు ఒనగూడిన ప్రయోజనం శూన్యం. తనదేశ ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని దుస్థితిలో పాకిస్థాన్ ఆర్థికసాయం కోసం ప్రపంచం ముందు సాగిలపడింది. పాక్ తను నాశనమైనప్పటికీ భారత్‌ను నాశనం చేయడానికి చైనాతో చేతులు కలిపింది. పాక్-చైనా ఆర్థిక కారిడార్ అందుకు ప్రత్యక్ష నిదర్శనం. కొట్లాటల వలన యుద్ధాల వలన ఎవరికీ ఒనగూడే ప్రయోజనం ఉండదు. ప్రాచీనకాలంలో యుద్ధాలన్నీ సంప్రదాయమైన ఆయుధాలతో జరిగేవి.ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. మొదటి ప్రపంచం యుద్ధ ముగిసి శతాబ్దం దాటిపోయింది. 1914-18 మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో సుమారు కోటి మంది వరకూ మరణించారు. 1939-45 సంవత్సరాల మధ్య జరిగిన రెండవ ప్రపంచ యుద్ధంలో 8 కోట్ల మందికిపైగా మరణించారు. ప్రస్తుత ప్రపంచ మనుగడ వివిధ దేశాల ముఖ్యంగా అగ్రరాజ్యాల విజ్ఞత పైనే ఆధారపడి ఉంది. సామ్రాజ్య విస్తరణకు, యుద్ధకాంక్షకు స్వస్తిచెప్పి, శాంతియుతమైన వాతావరణంలో సమస్యల పరిష్కారానికి నిష్పక్షపాతమైన, అరమరికలు లేని, ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలి.యుద్ధతంత్రానికి స్వస్తిచెప్పి శాంతిమంత్రం జపించడమే ప్రస్తుత ప్రపంచ సమస్యలకు, యుద్ధ నివారణకు ఏకైక సూత్రం.ఆ దిశగా అడుగులు వడివడిగాసాగాలి. ఉన్మాదులు గర్జిస్తే అణ్వయుధ వర్షమే. భూమ్యాకాశాల్లో ప్రళయ ప్రకంపనలే. భూనభోంతరాలు దద్దరిల్లే మరో మహాసంగ్రామం ఆరంభం కాక ముందే అంతంపలకాలి. స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే పరిస్థితులను కాలరాసే హక్కు ఎవరికీలేదు. వ్యక్తిగతమైన అహంకారంతో ఇతరులను శాసించి ప్రపంచాన్ని ఏలాలనే దుగ్ధతో ప్రజల అభిప్రాయాలకు విరుద్ధమైన భావజాలంతో మానవాళిని భయకంపితులను చేస్తున్న యుద్ధ కాంక్షకు చరమగీతం పాడాలి. ●

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఆదివారం జూన్ 18 2023




# శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి



**మామిడికుదురు, జూన్ 17, (ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడి కుదురు మండలం అప్పనపల్లి గ్రామం లో వేంచేసియున్న శ్రీ బాల బాలాజీ స్వామి వారిని రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు శనివారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మద్దాలి తిరుమల సింగరాచార్యులు, ఆలయ సిబ్బంది శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదములు ఇచ్చి సత్కరిం చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణ అధికారిణి జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

# జనవాణికి వినతుల వెల్లువ

## - జయలక్ష్మి బ్యాంకు బాధితులకు న్యాయం చేయండి
## - పవన్ కల్యాణ్ కోరిన బాధితులు









**కాకినాడ సిటీ/ రూరల్ జూన్ 17, (ప్రభాతవార్త):** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 14వ తారీఖు నుండి చేపట్టిన వారాహి యాత్రలో బాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా కాకినాడలోని హెలికాన్ టైమ్స్ (ముత్తా క్లబ్ )కు చేరుకుని బస చేసారు. శనివారం ఉదయం ముఖ్య నాయకులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పలు సమస్యలతో ప్రజలు వెల్లువెత్తారు.

**15 వందల కోట్లు కొల్లగొట్టారు...న్యాయం చేయండి**

జయలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ చేసిన బాధితులు పవన్ కల్యాణ్‌ను కలిసి తమ గోడు వెళ్ళబుచ్చారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చాలా మంది జయలక్ష్మి బ్యాంకు నందు డిపాజిట్ చేసామని అయితే బ్యాంకు చైర్మెన్ తమ డిపాజిట్లకు సమాధానం చెప్పకుండా తార్సరం చేసారని ప్రభుత్వం బ్యాంకు యజమానులపై కేసులు కట్టి తమని గాలికి వదిలేసారని తమకు న్యాయం చేయమని కోరారు.

**సంవత్సరాలుగా పెంక్షన్ వస్తుంటే నా పెంక్షన్ తీసివేసారు - దివ్యాంగుని వేదన**

కనీసం నడవలేని కాళ్ళు చేతులు లేని తనకు విగలాంగ పెంక్షన్ తీసివేసారనీ తాము బ్రతకటం కష్టంగా ఉందని తమకు పెంక్షన్ వచ్చేలా చేయాలని కాకినాడ రూరల్ స్వామి నగర్ ప్రాంతానికి చెందిన దివ్యాంగుడు, అతని తల్లి పవన్ కల్యాణ్ వద్ద కన్నీటి పర్యాంతమయ్యారు. చలించిన పవన్ వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందనీ హామీ ఇచ్చారు.

**బటన్ నొక్కుడే గానీ తమకు న్యాయం చేయలేదు : న్యాయవాదులు వినతిపత్రం**

జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ప్రతీ నెలా జీవన భృతి ఇస్తానని నేడు ఇవ్వకుండా మొఖం చాటేసారనీ న్యాయవాదులు పవన్ కు వినతిపత్రం అందించారు.

**అభివృద్ధి పేరిట పంట భూములు లాక్కున్నారు..**
**-రూరల్ మండలం తమ్మవరం గ్రామ రైతులు మొర**

గ్రామం మొత్త 654 ఎకరాల సాగు భూమి ఉంటే పరిశ్రమలు నిర్మిస్తామని తమనుండి దాదాపు 350 ఎకరాలు భూమి సేకరణ చేసి తమను భూమికు దూరం చేసారని తమ భూములు తమకు ఇవ్వాలని ఇచ్చేలా చేయాలని కోరారు.

**డాయాలిసిస్ టెక్నిషయన్లకు న్యాయం చేయండి**

(మిగతా 6వ పేజీలో)

# ప్రారంభోత్సవానికి సిద్దమైన గ్రామ సచివాలయం



**అల్లవరం, జూన్ 17, (ప్రభాతవార్త):** ఎస్ పల్లెపాలెం గ్రామ సచివాలయం నూతన భవనం నిర్మాణం పూర్తి చేసారు త్వరలో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు ఇపుడు ప్రస్తుతం అంగన్ వాడి కేంద్రంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తి స్తున్నారు. ఈ గ్రామ సచివాలయ భవనం త్వరలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభోత్సవం చేయనున్నారు.

# మండేల బాబి దంపతులు చలివేంద్రంలో మజ్జిగ వితరణ

**అమలాపురం టౌన్, జూన్ 17, (ప్రభాతవార్త):** అమలాపురం పట్టణం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం దాతలుగా అమలాపురం పట్టణం గాంధీనగర్ వాస్తవ్యలు డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్త దిన పత్రిక జిల్లా బ్యూరో మండేల నాగ వెంకటప్రసాద్ (బాబి), పద్మావతి వారు చలివేంద్రం అవసరమయ్యే మజ్జిగను పంపిణీ చేశారు.




# వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



**ఆత్రేయపురం, జూన్ 17, (ప్రభాతవార్త):** కోనసీమ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన ఆత్రేయపురం శ్రీ వాడపల్లి వెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గౌతమి గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి క్యూలైన్లో నిలబడి ప్రత్యేక పూజలు చేస్తూ మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తదితర సిబ్బంది పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆలయం వద్ద తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు.

# నేడు రామదూత స్వామి పుట్టిన రోజు వేడుకకు ఏర్పాట్లు



**కొత్తపేట, జూన్ 17, (ప్రభాతవార్త):** భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామివారి జన్మదిన మహాపర్వం సందర్భంగా దివ్యధామం కొత్తపేట మండలం మోడేకుర్రు లలిత గోవిందరావు స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8:30 గంటలకు మంగళవాయి ద్యాలతో వేదపఠనము, ఓంకారం, ధ్యాన శ్లోకాలు, శ్రీ వేణు దత్తాత్రేయ స్వామివారి అర్చన, భగవాన్ శ్రీశ్రీశ్రీ రామదూత స్వామివారి పాదుకా పూజ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల ప్రసంగాలు, పాటలు, భజనలు, భక్తులచే స్వామివారి పాదుకలకు పుష్ప వందన అనంతరం అన్నప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తవుతుందని చెప్పారు. భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించి రావాలని ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి జూమ్, యూట్యూబ్‌ల ద్వారా ప్రసారం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి పాదుకా పూజలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు శ్రీమతి & శ్రీ వట్టికూటి లలిత గోవిందరావు కోరా రు. వివరాలకు : 9949557988, 8186878829 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలన్నారు.

# సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించండి

## పంచాయతీ సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన ట్రైనీ కలెక్టర్ ప్రఖార్ జైన్

**శంఖవరం, జూన్ 17, (ప్రభాతవార్త):** మండలంలోని మేజర్ పంచాయతీ, రెండు జాతీయ రహదారుల ముఖ్య కూడలి గ్రామమైన కత్తిపూడిలోని ప్రజల సమస్యలపై దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ట్రైనీ కలెక్టర్ ప్రఖార్ జైన్ ఆదేశించారు. ఇటీవల కత్తిపూడి గ్రామం నుండి అధిక సంఖ్యలో జిల్లా స్పంధనకు తాగునీరు, వీధి లైట్లు, పారిశుధ్య సమస్యలపై తరచూ పిర్యాధులు అందుచున్న నేపధ్యంలో ట్రైనీ కలెక్టర్ ప్రఖార్ జైన్ కత్తిపూడి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీకి వస్తున్న ఆదాయం, చేస్తున్న వ్యయం, చేపడుచున్న పనులు వంటి అంశాలపై అధికారుల నుండి వివరాలు సేకరించి, రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రజలకు ఎప్పుడూ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండాలని, సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పంచాయతీ సిబ్బందికి ట్రైనీ కలెక్టర్ ప్రఖార్ జైన్ దిశా నిర్దేశం చేశారు.

# ప్రతిభ కనబర్చిన ఆణిముత్యాలకు నగదు పురస్కారం

## దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు : మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ

**రాజమహేంద్రవరం బ్యూరో, జూన్ 17, (ప్రభాతవార్త):** భారతదేశం లోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతిభగల విద్యార్థినీ, విద్యార్థుల్లో మరింత పోటీతత్వాన్ని పెంచేందుకు గాను ప్రోత్సహిస్తున్నారని జిల్లా ఇన్చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, రాష్ట్ర పౌరసరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జగనన్న ముత్యాలు సందర్భంగా ప్రతిభ కనబర్చిన 22 మంది విద్యార్థినీ, విద్యార్థులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమెంటో, నగదు పురస్కారాన్ని కలెక్టరు మాధవీలత, రుడా చైర్పపర్సన్ షర్మిలా రెడ్డి, కమీషనరు దినేష్ కుమార్‌తో కలసి మంత్రి వేణుగోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి వేణుగోపాల్ మాట్లాడుతూ డా.బి.ఆర్. అంబేద్కర్ విద్య ద్వారానే పేదరికాన్ని జయించి ఉన్నతమైన స్థానానికి చేరుకోవడానికి సాధ్యమవుతుందని పేర్కొనడం జరిగిందన్నారు.



ఆ మాటలను అక్షర సత్యాలను చేస్తూ నేడు జగనన్న ప్రభుత్వం ఒక మేనమామలా తల్లితండ్రుల పక్షాణ పిల్లల చదువు బాధ్యతలను తానే స్వయంగా తీసుకోవడం జరిగిందన్నారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా అమ్మఒడికి రూ.19674 కోట్లు, విద్యాదీవెన, వసతి దీవెన కింద 9947 కోట్లు, గోరు ముద్ద కింద 3500 కోట్లుతో పాటు నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, విదేశీ విద్యా దీవెన వంటి అనేక కార్యక్రమాలను పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టి పటిష్టంగా అమలు చేయడం జరిగిందన్నారు. నేడు మరో అడుగు ముందుకేసి జగనన్న ఆణిముత్యాలుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సన్మానం చేయడం ద్వారా నూతన సాంప్రదాయాన్ని శ్రీకారం చుట్టి వారి గౌరవిస్తున్నామన్నారు. కృషి తో నాస్తి దుర్భిక్షం అనే నానుడికి విద్యా విధానంలో కొత్త అర్థాన్ని తీసుకు రావడం ద్వారా “విద్యతో నాస్తి దుర్భిక్షం” అని నిరూపిస్తున్న వ్యక్తి జగన్ మామయ్య అని మంత్రి పేర్కొన్నారు. నాడు నేడు కింద ప్రభుత్వ స్కూల్స్‌లో అభివృద్ధి పనులు, నాణ్యత తో కూడిన విద్యను ప్రభుత్వ స్కూల్స్‌లో అందిస్తున్నారు. పేద కుటుంబాల్లో పుట్టి ప్రభుత్వం పాఠశాల్లోను, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు తగిన ప్రోత్సాహకాలు ఇచ్చే విధానంలో పదవ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 22 మంది విద్యార్థులను జిల్లా స్థాయిలో సన్మానించామన్నారు. మొదటి బహుమతిగా రు. 50 వేలు బంగారు పతకం, ధృవపత్రం, రెండవ బహుమతిగా రు.30 వేలు, రజత పతకం, ధృవ పత్రం, మూడవ బహుమతిగా రు.15 వేలు, కాంస్య పతకం, ధృవపత్రం అందిస్తూ వారికి తల్లిదండ్రు లకు పాఠశాలలకు గర్వకారణంగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇదే విధానంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 189 పాఠశాలల్లో చదువుతున్న తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానిస్తున్నామన్నారు. అదేవిధంగా 7 నియోజకవర్గాల స్థాయిలో 25 మంది పదవ తరగతి విద్యార్థులను 28 ఇంటర్ విద్యార్థులను సన్మానిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు ఫీజు రీయంబర్సుమెంటు నియంత్రించి కొద్దిమందికే ఇవ్వగా, నేడు మనుప్రభుత్వం అర్హులైన విద్యార్థులందరికీ నూరు శాతం ఫీజు రీయంబర్సుమెంట్ అందజేస్తూ పేద కుటుంబాల పక్షాన నిలబడి వారి ఉన్నతి బాసటగా నిలుస్తున్నామన్నారు. 2009లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి శ్రీకారం చుట్టారు. (మిగతా 7వ పేజీలో)

# రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి... మరో 9 మందికి తీవ్ర గాయాలు



**ఆలమూరు, జూన్ 17, (ప్రభాతవార్త):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి 216ఏ నెంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు సంఘటన స్థలంలోని మృతిచెందగా మరో 9 మందికి తీవ్ర గాయాలైనట్లు రావులపాలెం సిఐ రజిని కుమార్, ఆలమూరు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. వారి వివరాలు ప్రకారం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముద్దుర్తి నుండి కోనసీమ జిల్లా మందపల్లి టాటా ఏసీ వాహనంలో 9 మంది రాజమహేంద్రవరం వైపు నుండి రావులపాలెం వైపు వస్తుండగా అదే మార్గంలో విశాఖ పట్నం నుండి పాలకొల్లు నలుగురుతో వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదంలో టాటా ఏసీ రోడ్డు పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో టాటా ఏసీలో ప్రయాణిస్తున్న ముద్దుర్తికి చెందిన ప్రతివాడ కన్నయ్య లింగం (55), బోడి వెంకి నాయుడు (55) గంగిరెడ్ల శ్రీను (38) సంఘటన స్థలంలోని మృతి చెందగా అదే వాహనంలో ప్రయాణిస్తున్న మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కారు రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వేగేస్న సుబ్రహ్మణ్యం రాజు సంఘటన స్థలంలో మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ హైవే అంబులెన్స్ 108 అంబులెన్స్‌లపై రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి కొత్తపేట డిఎస్పి కే వెంకటరమణ, రావులపాలెం సిఐ రజిని కుమార్, ఎస్ఐ శివప్రసాద్ సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే జాతీయ రహదారుల సూపర్వైజర్ రమేష్, టోల్ మేనేజర్ నెహేమియా, హైవే అధికారి రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులు..జగనన్న ఆణిముత్యాలు



**గోకవరం, జూన్ 17, (ప్రభాతవార్త):** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట ప్రభుత్వం సత్కారంలో భాగంగా శనివారం మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యా కమిటీ సభ్యుల సమక్షంలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నగదు పుష్కారంతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు సుంకర వీరబాబు మాట్లాడుతూ ఈ అవార్డుల వేడుకను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 2023 మార్చి, ఏప్రిల్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో ప్రభుత్వం సన్మానించడం వలన మిగిలిన విద్యార్థులు కూడా అవార్డు గ్రహీతలుగా మారేందుకు చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, మంచి చదువులు చదవాలనే ఉద్దేశంతో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అని అన్నారు అనంతరం పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన కే. విజయ్ కుమార్ (520), ద్వితీయ స్థానంలో ఎస్. పావని చందు (512), తృతీయ స్థానంలో నిలిచిన పి. ఎస్ ఎస్ డి ఎన్ ఎస్ సుబ్బారావు (508), ఏ హేమశ్రీ వల్లి (508) తో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో టౌన్ కన్వీనర్ చింతల అనిల్ ప్రధానోపాధ్యాయులు పల్లాల సత్యనారాయణ రెడ్డి, చైర్మన్ కణిత శీను ఎంపీటీసీ సభ్యులు తోలేటి రమ్యశ్రీ రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పులపర్తి బుజ్జి, విద్యా కమిటీ వైస్ చైర్మపర్సన్ చంద్ర పాటి వరలక్ష్మి, విద్యా కమిటీ డైరెక్టర్ మద్దాల లక్ష్మణరావు, షేక్ కరిమునిషా, దాసరి లక్ష్మీ, దుక్క దేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జనవాణికి వినతుల వెల్లువ

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 వేలకు పైబడి డయాలిసిస్ టెక్నిషియన్స్ ప్రభుత్వపరమైన ఉద్యోగాలు లేవని ప్రవేట్ హాస్పటల్స్ నందు ఉపాధి పొందుతున్నామని తమకు ప్రభుత్వ పరమైన ఉద్యోగాలు ఇవ్వాలని కొరారు.

**టిడ్కో ఇళ్ళు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలి..**

గత ప్రభుత్వం టిడ్కో నిర్మాణాలు చేసారు, వీళ్ళు రంగులు వేసారని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా తమకు ఇళ్ళు ఇవ్వలేదని తాము అద్దె ఇళ్ళల్లో ఉంటూ నానా కష్టాలు పడుతున్నామని టిడ్కో ఇళ్ళు వెంటనే ఇప్పించాలనీ కోరారు.

**రైతు బజార్లో సిటీ ఎంఎల్యే దౌర్జన్యం...**

కాకినాడ ఆర్టీసి కాంప్లెక్స్ దగ్గర ఉన్న రైతుబజార్లో సిటీ ఎంఎల్యే ద్వారంపూడి అనుచరులు దౌర్జాన్యానికి పాల్పడుతున్నారనీ రైతు బజార్ రెడ్డి బజార్‌గా చేసి నానా బాధలు పెడుతున్నారనీ విన్నవించుకున్నారు. ప్రభుత్వ హాస్పటల్లో రోగులను పశువులకంటే హీనంగా చూస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన ప్రభుత్వ హాస్పటల్లో రోగులకు సరైన సదుపాయాలు కల్పించకుండా పశువులకంటే హీనంగా చూస్తున్నారనీ సిబ్బంది,డాక్టర్ల కొరత వలన వైద్యం కోసం వెళ్ళిన రోగులు నానా అవస్థలు పడుతున్నామని హాస్పటల్ పనితీరు పై స్పందించాలనీ కోరారు.

**5 వేల పట్టాలు ఇచ్చారు..స్థలాలు ఇవ్వలేదు..**

కాకినాడ గ్రామీణ నియోజక వర్గంలో కరప మండలంలో దాదాపు ఐదు వేల పట్టాలు పంపిణీ చేసారనీ అయితే వందమందికి మించి స్థాలాలు ఇవ్వలేదని వాపోయారు..పట్టాలిచ్చిన వారికి స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కుంబాభిషేకం వద్ద ఆలయానికి సంబంధించిన భూమిని కబ్జా చేశారని మత్స్యకారులు వినతిపత్రం సమర్పించారు. కాకినాడ సిటీలోనే రైతు బజార్లో రైతులను సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధిత రైతులు విన్నవించుకున్నారు. కాకినాడ రూరల్ మండలానికి చెందిన ఇంద్రపాలెం, కొవ్వాడ, చీడిగ, రామేశ్వరం గ్రామాలకు మంచినీటి సదుపాయం సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మొర పెట్టుకున్నారు. స్వామి నగర్ కు చెందిన దివ్యాంగుడుకు పింఛను తొలగించారని దివ్యాంగుడి తల్లి కంట నీరు పెట్టుకుని వినతి పత్రం అందజేశారు. రెల్లి కులస్తులకు చెత్త పన్ను విధించిన చెత్త ప్రభుత్వం వైసీపీ చెత్త పన్నుపై మినహాయింపు ఇవ్వాలని కోరారు. కాకినాడ జెట్టికు సంబందించి 8వ బెర్త్ నిర్మాణం చేయటానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తే దాన్ని నిర్మిస్తే మత్స్య సంపద నశించి మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతారనీ మత్స్యకారులు విన్నవించుకున్నారు.

## గోమాతకు శ్రీమంతం.. ఎన్నో జన్మల పుణ్యఫలం



**అంబాజీపేట, జూన్ 17, (ప్రభాతవార్త):** హిందువులు ఎంతో పవిత్రంగా పూజించే గోవు తల్లితో సమానమని, అటువంటి గోమా తకు పూజ చేస్తేనే ఎంతో పుణ్యమని, శ్రీమంతం చేస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుందని కాసు కుటుంబీకులు పేర్కొన్నారు. అంబాజీపేటకు చెందిన దివంగత కాసు వెంకట నాగభద్రం కవల కుమారులు కాసు నాగేంద్ర, గాయత్రీ, ఫణీంద్ర, డా.ప్రవల్లిక దంపతులు గిర్ జాతికి చెందిన గోమాతకు స్థానిక పెద్ద వీధిలో ఉన్న రాజ్ ఆయిల్ మిల్‌లో ఆవరణలో శనివారం సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పన నాగప్రసాద్, సత్యలక్ష్మీ, అప్పన సతీష్, కీర్తి, అప్పన రాజా, శుభ దంపతులు, కాసు గౌరీ మహాలక్ష్మి, అప్పన సృజన పాల్గొన్నారు.

## స్టోరేజ్ బ్యాంకులోకి కలుషిత నీరు తోడకం



**ముమ్మిడివరం, జూన్ 17, (ప్రభాతవార్త):** ముమ్మిడివరం సమగ్ర రక్షిత మంచినీటి పథకం స్టోరేజ్ టాంక్‌లోకి మురుగు నీరు తోడడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వేసవిలో మంచి నీటి స్టోరేజ్ టాంక్ నిల్వలు ఐదు అడుగులకు పడిపోయింది. ఈ మంచినీటి స్టోరేజ్ బ్యాంకుకు బొబ్బర్లంక పల్లంకుర్రు ప్రధాన పంట కాలవ పల్లవారిపాలెం నుండి స్టోరేజ్ బ్యాంకులోకి నీటిని నింపుతారు. జూన్ ఒకటో తేదీన నీరు విడుదల చేసిన 11 వ తారీకు వరకు నీటిని నింపే చర్యలు చేపట్లేదు. నీటి నిల్వలు పడిపోవడం చేపల మృతి చెంది స్టోరేజ్ టాంక్‌లో నీరు వాసన రావడంతో హడావుడిగా ట్యాంక్‌లోకి నీరును నింపే ప్రయత్నాలు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టారు. పల్లవారిపాలెం నుండి రెండు ఇంజన్లతో వాటర్ లిఫ్టింగ్ చేస్తున్న తక్కువ గా రావడంతో మాగం అయినాపురం పంట కాల్వ నుండి రెండు కృషి ట్రాక్టర్లతో స్టోరేజ్ ట్యాంక్‌లోకి శనివారం నీటిని నింపడం ప్రారంభించారు. అయితే ఈ పంట కాలువ ఎగువన నివాస గృహాల్లోని మరుగుదొడ్ల నుండి వ్యర్థపనీరు కాల్వలోకి వదులుతున్నారు. దీంతో పంట కాలువలోని నీరు కలుషితవుతుంది. ఈ కలుషిత నీటిని స్టోరేజ్ ట్యాంకు తోడుతున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడం జరుగుతుంది



**యు.కొత్తపల్లి, జూన్ 17 (ప్రభాతవార్త):** అగ్ని ప్రమాద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవడం జరుగుతుందని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని గోర్స గ్రామంలో శుక్రవారం రెండు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యి నిరాశ్రయులైన బూరా లోవ రాజు, బూరా నూకరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శనివారం పరామర్శించి నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ఐ ఏ వై పథకంలో ఇల్లు నిర్మించుకోవడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచి రొంగల వీరబాబు, ఎంపీపీ కారే సుధా, జడ్పిటిసి గుబ్బల తులసి కుమార్, వైస్ ఎంపీపీ చెట్టు బత్తిన సురేష్ కుమార్, మండల వ్యవసాయ అడ్వైజర్ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరరావు, వైయస్సార్ సిపి నాయకులు పూజ్యం సతీష్ బాబు, నడిగట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## చిట్యాలలో 'జగనన్న ఆణిముత్యాలు'



**గోపాలపురం, జూన్ 17, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలం, చిట్యాల జిల్లా పరిషత్ హై స్కూలులో 'జగనన్న ఆణిముత్యాల' కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. హెచ్ఎం శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హై స్కూలులో పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినిలకు బహుమతుల ప్రదానం చేసారు. నాబోతు లక్ష్మి రజిత ప్రథమ స్థానం సాధించగా రూ.3 వేల నగదు, ప్రసంశా పత్రం అందజేశారు. మాడుగుల రత్నకుమారికి ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, ప్రశంసా పత్రం, తృతీయ బహుమతిగా గొల్ల లావణ్యకు రూ. వెయ్యి, ప్రశంసా పత్రం అందజేశారు. అదేవిధంగా సైన్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయిలను ఆ పాఠశాల సైన్స్ టీచర్ రాఘవ్ కుమారి బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూతంగి సరోజిని, ఎంపీటీసీ సభ్యురాలు బూసి బేబీశ్వరి, రిటైర్డ్ ఐఎఫ్ఎఫ్ ఆఫీసర్ పీతల ప్రసాద్, సిఆర్పి కొయ్యే నాగరాజు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల విద్యాబోధనే శాశ్వతంగా గుర్తుంటుంది



**అంబాజీపేట, జూన్ 17, (ప్రభాతవార్త):** ప్రాథమిక పాఠశాల విద్యాబోధనే విద్యార్థులకు శాశ్వతంగా గుర్తుంటుందని, ప్రాథమిక విద్యా దశలోనే సక్రమమైన విద్యాబోధన అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు వాసంశెట్టి నాగవేణి అన్నారు. మండలంలోని మాచవరం శివారు బెహరా వారి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పి.గన్నవరం మండలం వెళుతున్న రాయుడు బేబి అనూషను ప్రధానోపాధ్యాయులు వాసంశెట్టి నాగవేణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకరించడంతో పాటు విద్యార్థులకు మంచి తర్ఫీదునందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మట్టా పార్వతి, వార్డు సభ్యులు కోట గోపి, పీఎంసీ చైర్మన్ యలమంచలి తాతారావు, కుసుమ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు డి.సూర్యకళ, సీఆర్పీ ఎన్.వెంకటేష్, స్థానికులు కొల్లూరి బలరామకృష్ణ, కొల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

**చాగల్లు, జూన్ 17, (ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లా స్థానిక చాగల్లు మండల కేంద్రం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 19వ తారీఖున అనగా సోమవారం నుండి రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చాగల్లు మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలను అనుసరించి ఈ ఎంపిక పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఈ పోటీలలో బాల బాలికలు 4వ తరగతి లేక 5వ తరగతి చదువుతూ ఉండాలని ప్రైవేటు బాల బాలికలు కూడా ఈ పోటీలో పాల్గొనవచ్చునని తెలిపారు.. ఈ పోటీలో పాల్గొనే బాలబాలికలు పోటీలు నిర్వహించే తారీఖున ఉదయం 9 గంటలకు స్థానిక చాగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్స్ వద్ద రిపోర్ట్ చేయవలెనని తెలియజేశారు.. పోటీలలో భాగంగా 30 మీటర్ల పరుగు పందెం ఎనిమిది వందల మీటర్ల పరుగు పందెం స్టాండింగ్ బ్రాడ్ జంప్ ఎత్తు బరువు మొదలగు పోటీలు నిర్వహించబడతాయని అన్నారు. మండల స్థాయిలో ఎంపిక కాబడిన బాలబాలికలు తదుపరి రాజమండ్రిలో జరగబోవు జిల్లా స్థాయి ఎందుకు పోటీల్లో పాల్గొనకు అర్హత పొందుతారు తెలిపారు... సదరు పోటీలు ఎంపిక చేసే కమిటీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిని చైర్మన్‌గా, తహసిల్దారు మండల విద్యాశాఖ అధికారి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీ మెంబర్స్‌గా, పిఈటి నెంబర్ కన్వీనర్‌గా ఈ కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. చివరగా ఎవరికైనా ఆసక్తి ఉన్నట్లయితే కోటి నిర్వహించే రోజు ఉదయం ఉన్న రిపోర్ట్ ఇవ్వాలని ముందస్తుగా తెలియజేశారు.

## సాకా చిన్ని బాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**ముమ్మిడివరం, జూన్ 17, (ప్రభాతవార్త):** సాకా చిన్ని బాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రజలకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు మొబైల్ మజ్జిగ చలివేంద్రం ద్వారా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకులు సాకా ప్రసన్న కుమార్ వీటిని అందించారు. మజ్జిగ ప్యాకెట్లు అందించిన ప్రసన్న కుమార్‌ను పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవాని హితకారిణి చైర్మన్ కాశి బాలమునికుమారి జడ్పిటిసి కుడుపూడి శంకర్రావు కోలా బాబ్జి బొంతు సత్య శ్రీనివాస్ అడ్డగళ్ళ సాయిరాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జగనన్న నవరత్నాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం

**పెదపూడి, జూన్ 17, (ప్రభాత వార్త):** కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామంలో జగనన్న నవరత్నాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. మామిడాడ మూడవ సచివాలయం పరిధిలో సుమారు 300 మంది లబ్ధిదారులు పాల్గొని జగనన్న పాలనలో పేద బలహీన వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇటువంటి సంక్షేమ పాలన ఎప్పుడూ చూడలేదని, కచ్చితంగా 2024 ఎన్నికల్లో సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి చేస్తామని ముక్తకంఠంతో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లంక మున్ని, ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, గ్రామ కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, కేత శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ తాతారెడ్డి పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## డిటిఓ అశోక్ ప్రతాప్ రావు



**ఆలమూరు, జూన్ 17, (ప్రభాతవార్త):** వాహన ప్రమాదాలు జరగకుండా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా రవాణా శాఖ అధికారి డి అశోక్ ప్రతాప్ రావు, మండపేట మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం మడికి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ ప్రమాదం మానవ తప్పిదమా లేక వాహనంలో ఏర్పడిన సాంకేతిక లోపమా అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు అన్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున జరిగే ప్రమాదాల్లోనే భారీ ప్రాణనష్టం సంభవిస్తున్నాయని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రైవర్లు నిద్ర మత్తులోకి జారకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బాటసారులు రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా పరిశీలించిన తరువాతే రోడ్డు దాటాలని తెలిపారు.

# పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మామిడికుదురు, జూన్ 17, (ప్రభాతవార్త):** మామిడికుదురు శ్రీగోకవరపు గణాధిపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73 సం.లో పదవ తరగతి అభ్యసించిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. సుమారు 50 సంవత్సరాల క్రితం చదువుకుని వివిధ ప్రభుత్వోద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన ఈపాత స్నేహితులతో పాఠశాల ప్రాంగణం అంతా కళకళలాడింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంతో ఆప్యాయతతో ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి పాఠాలు నేర్పిన గురువులు ఎరుబండి లక్ష్మయ్య, పి.ఎస్.ఆర్. కె.పరమహంసలను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలసి భోజనాలు చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.నిరంజని, కమిటీ ఛైర్మన్ జాలెం రాంబాబు, కార్యదర్శి మైలవరపు రవీంద్రనాథ్, ఈలి వీరాస్వామి, సిర్రా జగ్గారావు, శిష్టా సుబ్బారావు, కశిలంక సత్యనారాయణ, షబ్బీర్ హుస్సేన్, దస్తే అహ్మద్, రాజక్ అలీ, అమీర్ అలితో పాటు అధిక సంఖ్యలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మార్కులు సాధించిన ఆణిముత్యాలకు సత్కారాలు



**ప్రత్తిపాడు, జూన్ 17, (ప్రభాతవార్త):** పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జగన్ సర్కార్ శుభవార్త తెలిపిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని 2022-23లో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో ప్రభుత్వం సత్కరించనుంది. నియోజకవర్గస్థాయిలో విద్యార్థులను నేటి నుంచి సత్కరించారు. ప్రత్తిపాడు మండలంలోని శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆణిముత్యాలుగా ఎన్నికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు మెడల్స్ నగదు అందజేశారు. విద్యార్థిని విద్యార్థులు అన్ని విధాల రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ మండల ఇన్చార్జ్ రామిశెట్టి చినబాబు, రామిశెట్టి నాని, సొసైటీ అధ్యక్షులు కోప్పన గంగారావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఓరుగంటి వెంకన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

**పెద్ద శంకర్ల పూడిలో**

ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఆదేశాలు అనుగుణంగా పెదశంకర్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణతలో తమ ప్రతిభను కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన వారికి జగనన్న విద్యార్థులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో జగనన్న ఆణిముత్యాలు పేరుతో వారికి నగదు, సర్టిఫికేట్ అందజేసి సన్మానించారు. అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దలే చిట్టిబాబు చైర్మన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పశు బీమా పథకంను పాడి రైతులు వినియోగించుకోవాలి



**అంబాజీపేట, జూన్ 17, (ప్రభాతవార్త):** డాక్టర్ వైయస్సార్ పశు భీమా పథకంను పాడి రైతులు వినియోగించుకోవాలని పి.గన్నవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలయకులు విజయరెడ్డి అన్నారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో అంబాజీపేట పశువైద్యాధికారి డి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ రెడ్డి మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు మరణిస్తే పశుపోషకులకు ఆదాయంగా నిలబడేందుకు ప్రభుత్వం వైయస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఎస్సీ, ఎస్టీ వారికి రూ.30 వేలు విలువచేసే పాడి పశువుకు ప్రీమియం మూడేళ్లకు రూ. 384లు చెల్లించాలన్నారు. రూ.15 వేలువిలువ చేసే పాడిపశువుకు రూ.192లు చెల్లించినట్లయితే మూడేళ్ల బీమా సదుపాయం ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు లేనివారికి రూ.30వేలు విలువచేసే పాడి పశువుకు ప్రీమియం మూడేళ్లకు రూ.960 చెల్లించాలన్నారు. రూ.15 వేలు విలువ చేసే పాడిపశువుకు రూ.480 చెల్లిస్తే మూడేళ్ల బీమా వర్తిస్తుందన్నారు. రూ.ఆరు వేలు విలువచేసే గొర్రెలు, మేకలు, పందులు ఏడాదికి రూ.36,మూడేళ్లకి రూ.75 చెల్లించాలన్నారు. వరదలు, తుపానులు, పిడుగు పడి చనిపోవుట, పాముకాటు, అటవీ జంతువులు దాడి, అగ్ని ప్రమాదం,రోడ్డు, రైలు ప్రమాదాలు, పశువులు వ్యాధి బారిన పడి చనిపోవడం మొదలగు సందర్భంలో వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి, ఆర్బీకే చైర్మన్ రాయుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

# మరలా జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం

## - సింగపూర్ ఎన్నారైలతో ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, జూన్ 17, (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగపూర్ ఎన్నారై విభాగం సభ్యులతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా వారితో కలిసి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏ.పి.ఎన్.ఆర్.టి.ఎస్) సభ్యులకు కోనసీమ తిరుమలగా ఖ్యాతి గాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ విశిష్ఠతను వివరించి దర్శనానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దువ్వూరు మురళీకృష్ణారెడ్డి, సింగపూర్ తెలుగు సమాజం మాజీ ప్రెసిడెంట్ కొమ్మిరెడ్డి కోటిరెడ్డి, ఏ.పి.ఎన్.ఆర్.టి.ఎస్ కో ఆర్డినేటర్ మేడపాటి సందీప్ కుమార్ రెడ్డి, జీవన్, ప్రసాద్, రామచంద్రారెడ్డి, సంతోష్, చంద్ర, అంజనేయరెడ్డి, విజయభాస్కరరెడ్డి, నల్లమిల్లి భాస్కరరెడ్డి, పడాల సుధాకరరెడ్డి, ద్వారంపూడి సుబ్బారెడ్డి, పడాల చిన్నారెడ్డి, తమనంపూడి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాడీ బిల్డింగ్‌కి రమేష్ సేవలు ఎనలేనివి



**అమలాపురం, జూన్ 17, (ప్రభాతవార్త):** ఇటీవల అనారోగ్యంతో మరణించిన తోరం రమేష్ బాడీ బిల్డింగ్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసారని హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ ఏర్పాటుచేసిన సంతాపసభలో వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల పద్మరాజు మాట్లాడుతూ జిమ్ నిర్వహణతో పాటు మంచి శిక్షణ నైపుణ్యమును బాడీ బిల్డింగ్ క్రీడాకారులకు నేర్పి ప్రతిభగల క్రీడాకారులను అమలాపురం నుంచి అందించి, పోటీలను కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేవాడని అన్నారు. బాడీ బిల్డింగ్ జిల్లా ప్రెసిడెంట్ ఒంటెద్దు వెంకన్నాయుడు మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ కోచ్ అంటే ఇలా ఉంటారా అనే విధంగా ఉంటూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు కూడా క్రమ పద్ధతిలో కఠోర శిక్షణ ఇచ్చేవారని బాడీ బిల్డింగ్ క్రీడకు ఎంతో సేవ చేశారని తెలిపారు. అనంతరం తోరం రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. ఈ సంతాప సభలో కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు అసోసియేషన్ మెంబర్స్ నగబేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, చికురుమల్లి కిరణ్ కుమార్, చిక్కం రాజబాబు, నార్ని శీను, కురసాల శివ, సుంకర సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# మునగాల శ్రీరంగపట్నం చెరువులో మట్టి తవ్వకాలు



**కోరుకొండ, జూన్ 17, (ప్రభాతవార్త):** కోరుకొండ మండలం మునగాల, శ్రీరంగపట్నం గ్రామాలలో గల చెరువులలో మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. మునగాల గ్రామ శివారు చెరువులో మట్టి తవ్వకాలు జరందుకున్నాయి. అలాగే శ్రీరంగపట్నం గ్రామాన్ని ఆనుకుని ఉన్న కాపవరం చెరువులో కూడా రాత్రి సమయాల్లో మట్టిని త్రవ్వి తరలిస్తున్నారు. దీనిపై ఆయా గ్రామాల వారిని అడుగగా మట్టి తరలింపుకు అనుమతులు ఉన్నాయంటూ కొంత మంది వ్యక్తులు వాపోతున్నారు. అక్రమంగా జరుగుతున్న తవ్వకాలపై రెవిన్యూ, ఇరిగేషన్, మైన్స్ అధికారుల చర్యలు ఏమవుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారులకు వివరణ కోరడానికి ఫోన్లు చేసినా అందుబాటులోకి రావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# ప్రతిభ కనబర్చిన ఆణిముత్యాలకు నగదు పురస్కారం

(5వ పేజీ తరువాయి)

తదుపరి రోజుల్లో ఎన్నో పేదవాడి ఇంటిలో ఒకరికి విద్యా దీపం వెలిగించడం ద్వారా మాత్రమే ఆ కుటుంబాల్లో మార్పు సాధ్యం అని నిరూపించిన వ్యక్తి స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి అన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు స్కూల్స్ ప్రారంభించిన తొలిరోజే అందించడం జరిగిందన్నారు. అమ్మఒడి, గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియం, విద్యా కానుక, సంపూర్ణ పౌష్టిక ఆహారం వంటి ఎన్నో పథకాలు పేద కుటుంబాల విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్మన్‌గా 2006-2011 మధ్య పనిచేసిన సమయంలో పిల్లలు హాజరు తక్కువగా ఉందని ప్రశ్నించగా స్కూలు నిర్వహణ, ఆడపిల్లల సామాజిక అంశాలను ఒక హెడ్మాస్టర్ తనకు వివరించారని వారు చెప్పిన కారణం తన మనస్సును తీవ్ర ఆలోచనకు గురిచేసి ఆందోళన కలిగించిందన్నారు. ఆనాడే అన్ని స్కూల్స్‌లో ఫర్నీచర్ ఏర్పాటు చెయ్యాలని సంకల్పం చేశామన్నారు. అప్పటి వరకు జిల్లాలో జరిగే ఇసుక అమ్మకాలు ద్వారా రూ.2.5 కోట్లు ఆదాయం వచ్చేదన్నారు. పాఠశాలలు అభివృద్ధి చేయాలనే నా సంకల్ప బలం వల్ల ఏడాది ఇసుక అమ్మకాలు ద్వారా రూ. 35 కోట్లు ఆదాయం వచ్చిందని ఆనాటి సీయం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టి తీసుకురాగా పాఠశాలల అభివృద్ధికి ముందుకు వెళ్లమని భరోసా ఇచ్చారని, మంత్రి పేర్కొన్నారు. ఆమేరకు పాఠశాలల్లో జిల్లాపరిషత్ హైస్కూళ్లలో పర్మిషర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. జిల్లా కలెక్టరు డా.కే.మాధవీలత మాట్లాడుతూ ఒక కుటుంబంలో తల్లితండ్రులు విద్యావంతులయితే ఆకుటుంబం మొత్తం విద్యావంతులుగా ఉండి సమాజాభివృద్ధి దోహదపడతారన్నారు. మా గ్రాండ్ ఫాదర్ వ్యవసాయ వృత్తిలో ఉన్నప్పటికీ తాను తన పిల్లలను చదివించడం జరిగిందన్నారు. తద్వారా మానాన్న విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి మా ముగ్గురు ఆడ పిల్లలను చదివించారని అందువల్ల నేను ఈరోజు ఈ స్థానంలో ఉండగలిగాన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభకు ప్రోత్సాహాన్ని అందిస్తే వారు ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి సాధ్యమవుతుందన్నారు. నేటి విద్యా విధానంలో ఎన్నో అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానాన్ని డిజిటలైజేషన్‌ను ప్రభుత్వ పాఠశాలలో తీసుకు రావడం ద్వారా ప్రయివేటు పాఠశాలలకంటే ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు నిలుస్తున్నాయన్నారు. ఈ రోజు కార్యక్రమ ముఖ్య అతిధులు అవార్డులు పొంది స్ఫూర్తిగా నిలిచిన విద్యార్థులే అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనరు కె.దినేష్ కుమార్, డీఈవో ఎస్.అబ్రహం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నరశింహం, ఉప స్కూల్స్ తనిఖీ అధికారి బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అవార్డులు, నగదు పురస్కారాలు పొందిన 22 మంది విద్యార్థులు ఇందులో ఎస్ఎస్‌సీ 15 మంది, ఇంటర్మీడియట్ 7 గురు విద్యార్థులు మంత్రి, కలెక్టరు చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు.

# వసతి గృహం ఆకస్మిక తనిఖీ



**ముమ్మిడివరం, జూన్ 17, (ప్రభాతవార్త):** ముమ్మిడివరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రహంతుల్లా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు సరిపోయే వసతి గదులు ఉన్నాయా వెంటిలేషన్ సౌకర్యం మెరుగ్గా ఉందా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో ఆహార పదార్థాలు భోజనం రుచి చూసారు. వసతి గృహ రికార్డులను సక్రమంగా ఉన్నాయని పరిశీలించారు. వసతి గృహ అధికారులు సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉంటున్నారా విద్యార్థులకు సమస్యలు ఏమైనా ఉన్నాయని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

# వైస్సార్సీపీ ప్రభుత్వం పరిపాలన రైతుల పాలిట మరణ శాసనం : మాజీమంత్రి గొల్లపల్లి



**మలికిపురం, రాజోలు, జూన్ 17, (ప్రభాతవార్త):** వైస్సార్సీపీ ప్రభుత్వ అసమర్థ పరిపాలన రైతుల పాలిట మరణ శాసనంగా మారిందని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శివకోటి గ్రామ తెలుగుదేశం పార్టీ గ్రామశేఖ అధ్యక్షులు కడలి ఏడుకొండలు ఇంటి వద్ద జరిగిన పంట మునిగింది పరిహారం ఇవ్వండి అనే కార్యక్రమంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యరావు పాల్గొని గత దాళ్వా పంట సమయంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతుల నుండి ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి పంట నష్టానికి సంబందించిన అంచనాలు వెయ్యలేదని అన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో రైతు అప్పుల పాలు అయిపోయి భిక్షగాడిగా మరిపోయాడని అన్నారు. దీనికి ఈ ప్రభుత్వ అసమర్థ విధానాలే కారణం అన్నారు. గత టిడిపి పాలనలో రైతుకు బరకం నుండి కోత మిషన్ వరకు సబ్సిడీపై ఇచ్చి, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగకుండా అదుపు చేస్తూ, ఇన్పుట్ సబ్సిడీ ఇస్తూ రైతుని కంటికి రెప్పలా చూస్తే ఈ వైస్సార్సీపీ పాలనలో రైతు సర్వనాశనం అయిపోయి బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నాడని అన్నారు. రాజోలు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ రైతు ప్రతినిధులు, కార్యకర్తలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ దరఖాస్తులపై న్యాయం చెయ్యాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఈ ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం లో రైతులకు పూర్తి న్యాయం చేస్తామని మాజీ మంత్రి గొల్లపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో చెల్లింగి సత్యనారాయణ, ముప్పర్తి నాని, కసుకుర్తి త్రినాధస్వామి, గాలిదేవర వెంకన్నబాబు, కొల్లాటి రామతులసి, ఎంపీటీసీ బొడ్డు కృష్ణారావు, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, చాగంటి స్వామి, పిండి సత్యనారాయణ, బొక్కా గోవింద్, మట్టపర్తి సత్యనారాయణ, రాజలపూడి రామకృష్ణ, అరుమిల్లి భానుసుధకార్, పితాని సూరిబాబు, వలవల శేఖర్, తమ్మినీడి రామకృష్ణ, మేడిది రత్నరాజు, బోళ్ల కృష్ణ సుబ్బారావు, బోళ్ల ప్రతాప్, మామిడిశెట్టి ఏసుబాబు, ఉండ్రు రామకృష్ణ, మట్టపర్తి బుజ్జి, అనిశెట్టి సత్యనారాయణ, బొక్కా పృధ్వి, బళ్ల నర్సింహారావు, బత్తుల గోపాలం, ఉండ్రు అనిల్, కసుకుర్తి శ్రీనివాస శ్రీరామ చౌదరి, అప్పారి నాని, చెల్లుబోయిన ప్రకాశం, కడలి సత్యనారాయణ, పితాని నాగేశ్వరరావు, పితాని సూర్యనారాయణ, వెలుగొట్ల కృష్ణ, వెలుగొట్ల దుర్గారావు, పితాని భాను, పితాని సత్తిపండు, పితాని సత్యనారాయణ, పితాని వీర వెంకట సత్యనారాయణ, పందే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారులు సజ్జలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జమ్మలమడక



**కాకినాడ రూరల్ , జూన్ 17, (ప్రభాతవార్త):** తాడేపల్లి సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్, ఉభయగోదావరి జిల్లాల మహిళా భాగం జోనల్ ఇంచార్జ్ జమ్మలమడక నాగమణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.

## మింగేసిన సొమ్ము రికవరీ...డ్వాక్రా సంఘాల ఖాతాల్లోకి రూ 10.70 లక్షలు జమ

### వార్త కథనానికి స్పందన




**అమలాపురం రూరల్, జూన్ 17, (ప్రభాతవార్త):** అమలాపురం రూరల్ మండలం బండారులంక క్లస్టర్ డ్వాక్రా సీసీ మింగేసిన శ్రీనిధి రుణాల సొమ్మును అధికారులు తిరిగి రికవరీ చేశారు. డ్వాక్రా రుణాల సొమ్ము మింగేసారంటూ వార్త దినపత్రిక జిల్లా ఎడిషన్లో జూన్ 4వ తేదీన కథనం ప్రచురితమైంది. దాంతో డిఆర్డీఏ ఉన్నతాధికారులు స్పందించారు. పట్టువదలని విక్రమార్కుడిలా డిఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర్ తనదైన శైలిలో చర్యలు చేపట్టి రూ.10.70 లక్షలు రికవరీ చేయించారు. ఆ నగదును బాధిత డ్వాక్రా సంఘాల సభ్యుల బ్యాంక్ ఖాతాలకు బదలాయించారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇవ్వాల్సిన శ్రీనిధి రుణాల సొమ్మును బండారులంక క్లస్టర్ సీసీ మింగేయడంతో ఆ విషయాన్ని వార్త దినపత్రిక బయటపెట్టింది. దాంతో పీడీ శివశంకర్ స్పందించి అప్పటినుండి ఆ సొమ్మును రికవరీ చేయించేందుకు తనదైన శైలిలో చర్యలకు ఉపక్రమించారు. ఇంతలో రాజకీయం రంగ ప్రవేశం చేసినప్పటికీ వారికి అర్థమయ్యేలా వివరించి సీసీ మింగేసిన రూ10.70 లక్షలు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. శ్రీనిధి ఏజీఎం కూడా ఆయనకు వెన్నుదన్నుగా నిలిచి ఆ సొమ్మును రికవరీ చేసేందుకు తమ విధులకు స్పీడ్ పెంచారు. చివరకు దఫ దఫాలుగా 9 రసీదుల ద్వారా మొత్తం రూ10.70 లక్షలు రికవరీ చేసి వారి పనితీరును చాటుకున్నారు.

## అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం



**యు కొత్తపల్లి, జూన్ 17 (ప్రభాతవార్త):** అభివృద్ధి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని వాకతిప్పలో సచివాలయ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించబోయే సిసి రోడ్లు, సిసి డ్రైన్లకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా వైయస్సార్సీపి ప్రభుత్వం చేస్తుందన్నారు. అభివృద్ధిని అన్ని రకాలుగా చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అభినందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి పాలాని దొరబాబు, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, ఎంపీపీ కారే సుధా, జడ్పిటిసి గుబ్బల తులసి కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు కార్య శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైస్ ఎంపీపీ చెట్టు బత్తిని సురేష్ కుమార్, కొత్తపల్లి పిఎసిఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## గౌరవ వేతనంకు ఇమాములు దరఖాస్తులు చేసుకోవాలి

**అమలాపురం, జూన్ 17, (ప్రభాతవార్త):** ఆదాయం లేని మసీదుల్లోని ఇమాములు, మౌజన్లు గౌరవ వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆదాయం లేని మసీదులకు చెందిన అర్హులైన ఇనాములకు పదివేల రూపాయలు, మౌజన్లలకు 5 వేల రూపాయలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేతనం కొరకు మసీదు కమిటీ వారికి దరఖాస్తు చేసుకోవాలని చైర్మన్ అబ్దుల్ ఖాదర్, ఇన్స్పెక్టర్ ఆడిటర్ మహమ్మద్ షఫీ కోరారు. దీనికి సంబంధించి దరఖాస్తులు మసీదు పేర వున్న బ్యాంక్ అకౌంట్,పాస్ పుస్తకంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఇమాములు, మౌజనుల బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు, మసీదు అధ్యక్షుడు,ఇమాములు, మౌజర్ల పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాలన్నారు. అదేవిధంగా మసీదు మీద ఉన్న పాన్ కార్డు వారి యొక్క సెల్ఫోన్ నెంబర్లు మసీదు స్థల డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలు డాక్యుమెంట్లు లేని వారు సంబంధిత మసీదు పేరు రాసి హద్దులతో సర్వే నెంబరు విస్తీర్ణంతో గ్రామ సెక్రటరీ యొక్క ధ్రువపత్రం తీసుకుని దరఖాస్తు జతచేసి కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న జిల్లా వక్ఫ్ బోర్డు విభాగంలో సమర్పించాలని ఖాధర్ కోరారు.

## తొలకరి జల్లులు కోసం రైతుల ఎదురు చూపులు

### ప్రజలపై వరుణుడు కరుణించేదెప్పుడు



**అయినవిల్లి, జూన్ 17 ( ప్రభాత వార్త ) :** ఈ నెలంతా ఎండలే..జాడ లేని రుతుపవనాలు..తెలుగు నేల నిప్పుల కొలిమిలా మండుతోంది. రికార్డు స్థాయిలో నమోదవు తున్న టెంపరేచర్స్ జనాన్ని బెంబేలెత్తిస్తు న్నాయి. జూన్ 17 దాటినా దడపుట్టిస్తున్న ఎండలు, వడగాడ్పులు. మరో మూడు రోజులు జిల్లాల్లో హీట్ వేవ్స్ కొనసాగుతున్నాయి. వరణుడు కరుణించేదెపుడు... వర్షం ఎప్పుడు పడుతుందా అని ఆకాశం వైపు చూస్తున్నారు జనం. రుతుపవనాల ఎంట్రీకి బిపర్ జోయ్ తుఫాన్కు బ్రేకులు పడినట్లేనా అని అనుమానాలు కలుగుతున్నాయి. కదలని నైరుతి.. 'తొలకరి పలకరింపు' మరింత ఆలస్యం అవు తుందనే అనుకుంటున్నారు. నైరుతీ రుతుపవనాలు ఏపీలోనే నిలిచిపోయి. బిపోర్జోయ్ తుపానుతో నైరుతి కదలికలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ నెల 19 తరువాతే రుతుపవనాల గమనంపై స్పష్టత రానుంది. తొలకరి పలకరింపు లేక జిల్లాలో గ్రీష్మతాపం కొనసాగుతోంది. తొలకరి కోసం రైతుల ఎదురు చూపులు కొనసాగుతున్నాయి. గతనెలలో కురిసిన వర్షాలతో తొలకరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు.. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల విత్తనం, మరికొన్ని చోట్ల దుక్కులు దున్ని ఎదురు చూస్తు న్నారు. అయితే 20 రోజులు గడిచినా తొలకరి జల్లులు జాడ కనిపించడం లేదు. మృగశిర లోనూ ఎండలు మండుతున్నాయి. వాతావరణ పరిస్థితితో తొలకరి సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కటాక్షం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంలో కప్పలకి పెళ్లి జరిపించారు. రోహిణి కార్తె వెళ్లినా కూడా ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో వర్షాలు కురవడం కోసం కప్పలకు పెళ్ళి చేసినట్లుగా కొత్తపేట మండలం వాడపాలెంలో స్థానికులు తెలిపారు. పూర్వం కప్పలకి పెళ్లి చేసి ఊరంతా ఊరేగింపుగా ఉరేగిస్తే వర్షాలు కురిసేవనీ ఇదే తరహాలో వాడపాలెంలో కప్పలకు పెళ్ళి చేసినట్లు చెప్తున్నారు గ్రామస్తులు... జిల్లాలో భానుడు శాంతించాలి.. నైరుతి రుతుపవనాలు త్వరగా రావాలని పూజలు నిర్వహిస్తున్నారు.

## జీడిమామిడి రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి : బత్తుల బలరామకృష్ణ



**రాజానగరం, జూన్ 17 (ప్రభాత వార్త):** రైతులతో కలిసి జనసేన పార్టీ పక్షాన, ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. శనివారం స్థానిక గాంధి బొమ్మ సెంటర్లో జీడిమమామిడి రైతుల పక్షాన నిరసన ధర్నా చేసిన జనసేన పార్టీ నాయకులు బత్తుల బలరామకృష్ణ గత నాలుగు సంవత్సరాలుగా జీడిమామిడి,మామిడి రైతులకు పంటలు సరిగ్గా పండక పండినా సరైన గిట్టుబాటు ధర లేక, పెట్టుబడులు ఎక్కువై, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతులకు అండగా ఉండి ,సరైన గిట్టుబాటు ధర కల్పించి వారి వద్దనున్న జీడిపిక్కలను సరైన మద్దతు ధరతో ప్రభుత్వమే కొనాలనే ప్రధాన డిమాండ్ తో జనసేన పార్టీ పక్షాన ప్రజానాయకులు బత్తుల బలరామకృష్ణ రైతులతో, జనశ్రేణులతో మహానిరసన ధర్నా చేపట్టారు.ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి జనసేన నేతలు, రైతులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో తరతరాలుగా జీడీ మామిడి, మామిడి పంటలు పండించి అమ్ముకోవడమే ఇక్కడ రైతుల జీవన ఆధారం ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీడిమామిడి, మామిడి రైతుల పరిస్థితి చాలా దయనీయంగా తయారయింది ఎరువులు, పురుగు మందులకు సబ్సిడీపై ఇవ్వట్లేదు అంతేకాకుండా గత నాలుగు సంవత్సరాల క్రితం జీడి మామిడి బస్తా 12 వేల నుండి 14 వేల రూపాయలు ఉంటె నేడు మరీ దారుణంగా 3 నుండి 4 వేల రూపాయలకు అడుగుతున్నారు. పండించిన పంటకు సరైన ధర లేక చేతికందొచ్చిన జీడిపిక్కలు ఎవరూ కొనక కొన్ని రోజుల్లో వర్షాలు వస్తే జీడి పిక్కలు ఎక్కడ నిల్వ చేయాలో కూడా అర్థంకాని పరిస్తితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక బస్తా జీడి పిక్కలు తగ్గ ధర లేక,పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పంట కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్ముకునే స్తితిలో రైతులు ఉన్నారు... దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధర 15 వేల రూపాయలతో వెంటనే కొనుగోలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జీడి మామిడి, మామిడి రైతులతో కలిసి ప్రభుత్వ నిర్లక్ష్య వైకరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున మానవహారంగా ఏర్పడి రైతులకు న్యాయం చేయాలనీ నినాదాలు చేసి రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్ నుండి ఎంపిడిఓ ఆఫీస్ వరకు భారీ ర్యాలీగా నడుచుకుంటూ వెళ్లి ఎండిఓకి వినతి పత్రం అందజేసి తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేసి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జీడి మామిడి, మామిడి రైతులు, ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, జనసేన నేతలు, జనసైనికులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర పోటీ తత్వాన్ని ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు

### మోడల్ స్కూల్ కేజీబీవీ విద్యార్థులకు సత్కారం




**శంఖవరం, జూన్ 17, (ప్రభాతవార్త):** ఆరోగ్యకర పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక విధానాలను అమలుచేస్తున్నారని, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఆణిముత్యాలు పేరుతో అవార్డులు ప్రధానం చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు. శనివారం కాకినాడ జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నగదు పుష్కరాలు అవార్డులు ప్రధాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శంకవరం మోడల్ స్కూల్లో ఎంపీసీలో ప్రథమ స్థానం సాధించిన గవరసాని గంగాభవాని, ఏలూరు జిడిపి రామాంజలికు 50 వేల రూపాయల చెక్కు అందించి మెడల్తోపాటు ఘనంగా సత్కరించారు. మోడల్ స్కూల్లో పదో తరగతిలో 564 మార్కులతో జిల్లాల ప్రథమ స్థానం సాధించిన కర్నాటి గంగ మహేశ్వరికి 50 వేల రూపాయలు చెక్కు మెడల్ వేసి సన్మానం చేశారు. అదేవిధంగా మోడల్ స్కూల్లో పదో తరగతిలో 561 మార్కులతో తృతీయ స్థానం సాధించిన రేలంగి సత్య దుర్గా శ్రావ్యకు 15 వేల రూపాయలు చెక్కు మెడల్ వేసి సన్మానం చేశారు. అదేవిధంగా జిల్లాలో కేజీబీవీలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో ప్రథమ స్థానం సాధించిన కే సాయి దుర్గకు 50 వేల రూపాయలు చెక్కు, మెడల్ అందించి సన్మానించారు. అదేవిధంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి కేజీబీవీ ప్రిన్సిపాల్ బి బాల మణికుమారి మరియు విద్యార్థులు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.. సన్మానం పొందిన విద్యార్థులను ఉపాధ్యాయులను విద్యా కమిటీ చైర్మన్ స్థానికులు అభినందించారు.

## హెచ్ఎం రాజరాజేశ్వరికి సన్మానం



**అమలాపురం రూరల్, జూన్ 17, (ప్రభాతవార్త):** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేసి వారిని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరిగిబత్తిన రాజరాజేశ్వరికి ఘన సన్మానం లభించింది. ఇటీవల విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని దంగేటి సత్య పద్మిని 584 మార్కులు సాధించి జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించడంతో జిల్లా విద్యాశాఖకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. ఇటీవల జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో హెచ్ఎం రాజరాజేశ్వరిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అభినందించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని దంగేటి సత్య పద్మిని జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ విద్యార్థి ఆ స్థాయిలో మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ఉత్తమ విద్యాబోధన చేసేలా కృషిచేసిన హెచ్ఎం రాజరాజేశ్వరి పనితీరు భేష్ అంటూ కొనియాడారు. అనంతరం ఆమెకు దుస్సాలువా కప్పి పూలమాలలతో ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా, డీఈవో కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి : సిఐటియు డిమాండ్



**కాకినాడ రూరల్, జూన్ 17, (ప్రభాతవార్త):** రూరల్ మండలంలో ఏళ్ల తరబడి అయా పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు. వలసపాకల గ్రామపంచాయతీ వద్ద మీడియాతో రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని తక్షణం నిలబెట్టుకోవాలని, పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి గద్దె ఏక్కిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారన్నారు. ఈ నెల రెండో తేదీన రాష్ట్రంలో వివిధ డిపార్ట్మెంట్లో 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకు రావడం జరిగిందని అయితే ఈ రెగ్యులర్ చేసేటటువంటి కాంట్రాక్ట్ కార్మికులు లిస్టులో పంచాయతీ కార్మికులు లేకపోవడం దారుణమని అన్నారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 21వ తేదీన డిపిఓ ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం జరుగుతుందని ఈ ధర్నాకు పంచాయతీ కార్మికులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. నాగేశ్వరరావు, కే రాజు, జి.గంగరాజు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



**అయినవిల్లి, జూన్ 17 ( ప్రభాత వార్త ) :** మండలంలోని పలు కుటుంబాలను ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ బోమ్మి ఇజ్రాయిల్ శనివారం పరామర్శించారు. మండలంలోని కె.జగన్నాధపురం ఎంపిటిసి జలగం హేమలత భర్త వీర్రాజు గుండెపోటుతో మరణించడంతో ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించి, ఇరువురు పిల్లలను ఓదార్చారు. ఎంపిటిసి కుటుంబాన్ని ప్రభుత్వంపరంగా ఆదుకుంటామని అన్నారు. అలాగే రాయివారిపేటలో వృత్తీరీత్యా కరెంట్ పోల్పై పని చేస్తూ దురదృష్టశాత్తూ కింద పడడంతో తీవ్ర గాయాల పాలై ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న రాయి ధనరాజును, మాతృవియోగంతో బాధ పడుతున్న తొత్తరమూడి గ్రామానికి చెందిన నేదునూరి సత్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ మేడిశేట్టి ఉషారాణి శ్రీనివాస్, చెట్ల రామారావు, ఆకుమర్తి దుర్గారావు, చింతా రాంబాబు, అంకం వీర్రాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Print and Published Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajahmahendravaram - 533 103, Phone : 2469407, 2469408, RNI No. 64863/96, Editor: Damerla Sai Baba, Responsible for election of News-under the PRB Act. Regd.No. H/SD/337/90-11 Air Surcharge : Delhi : 40Ps

# డిజిపి అంతా తప్పుడు సమాచారం చెబుతున్నారు : సిపిఐ రామకృష్ణ

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు బాగున్నాయని ఏపీ డీజీపీ చెప్పడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంఎల్ఎ, సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, విశాఖలో భూకబ్జాలు లేవని డీజీపీ చెబుతుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలియడం లేదన్నారు.



శనివారం మీడియాతో మాట్లాడుతూ రామకృష్ణ డీజీపీ వ్యాఖ్యలపై మండిపడ్డారు,ఒక డీజీపీ స్థాయిలో తప్పుడు సమాచారం చెబుతున్నారన్నారు. సాక్షాత్తు విశాఖ ఎంపీ, కుమారుడు, సీఎంకు దగ్గరి వ్యక్తిగా ఉన్న ఆడిటర్‌ను కిడ్నాప్ చేసారన్నారు. అనంతపురంలో ఆత్మహత్య, ఏలూరులో యాసిడ్ దాడి, చెంచు నాడులో దళితులపై దాడులు జరిగాయని తెలిపారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు.పోలీస్ వ్యవస్థను నిర్వీర్య చేసి ప్రతి పక్షాలను నిర్బంధం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నడులేని విధంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షిణించాయన్నారు. హోంమంత్రి కేవలం నామాకు వాస్తి ఉన్నారన్నారు. హోంశాఖరు చూస్తున్నదంతా కడప వ్యక్తులే నన్నారు. సీఎం జగన్, డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఇలా అంతా కడప వ్యక్తులే అని తెలిపారు,రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుందన్నారు.ఈ మాఫియాకు అడ్డకట్ట వేయలేని స్థితిలో పోలీసు వ్యవస్థ ఉందన్నారు.గంజాయి,మాదక ద్రవ్యాలను అధికంగా చెలామణిలో ఉన్నాయన్నారు.వీటిని నియంత్రించ దిశలో పోలీసు ఉందన్నారు.గంజాయి మత్తుకు అలవాటు పడ్డారన్నారు. దాంతో పలు నేరాలకు పాల్పడుతున్నారన్నారు.పలు హత్యలు, అత్యాచారాలు వంటి నేరాలు నిందితులు గంజాయి మత్తులో వాటికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడిస్తున్నారన్నారు.

# ముక్కంటీశుని ఆలయం: శివనామస్మరణతో పునీతం

## రికార్డు స్థాయిలో రాహుకేతు దోష నివారణ పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామ స్మరణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి.ఆలయంలో అడుగుపెడితే భక్తి భావంతో తన్మయత్వం చెందుతున్నారు. స్వామి వారిని దర్శించుకొని వచ్చిన భక్తులకు 'అభయ వెంకటేశ్వరస్వామి' దర్శనం పునీతం చేస్తుంది. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళ కళ లాడింది. అనూహ్యంగా పెరిగిన రద్దీ: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాక ఒక్కసారిగా శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. శివానందైక నిలయం జనంతో కిట కిట: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు స్వయంగా పర్యవేక్షించగా వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎటు చూసినా జనం జనం అన్నట్లు మారింది. ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్లో పరిశీ లించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే జనం. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం.

# కంది, మినప పప్పు నిల్వలపై ఆంక్షలు

**విజయవాడ,జూన్17, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కంది,మినప పప్పు నిల్వలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వీటిని హోల్ సేలర్లు 200 మెట్రిక్ టన్నులు, రిటైలర్లు 5 మెట్రిక్ టన్నులకు మించి నిల్వ చేయకూడదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది.పెద్ద రిటైలర్లు తమ అవుట్‌లెట్‌లో 5 మెట్రిక్ టన్నులు,వారి డిపోల్లో 200 మెట్రిక్ టన్నులకు మించి నిల్వ చేయకూడదని తెలిపింది.ఈ పరిమితిని 2023 అక్టోబరు 31 వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. సంబంధిత నిల్వలను కేంద్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధనల అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుటామని తెలిపింది.

# వారాంతంలో జనసంద్రంగా తిరుమల

## - వెంకన్న సర్వదర్శనానికి 24 గంటలు

**తిరుమల,జూన్ 17 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో శనివారం ఉదయానికి కొండ కిటకిటలాడుతోంది. వేసవిసెలవులు ముగింపుకు చేరుకోవడం..ఆపై వారాంతం శని,ఆదివారాలు కలసి రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 51వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# దేశంలోనే ఎస్వీశిల్పకళాశాల ఆదర్శం

## సనాతన శిల్పశాస్త్రం భవిష్యత్‌తరాలకు అందాలి

## ఉపముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** సనాతనశిల్పశాస్త్రాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న కృషి అభినందనీయమని, దేశంలోనే తిరుపతిలో ఉన్న ఎస్వీశిల్పకళాశాల ఆదర్శంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఉచిత విద్య,భోజనం,హాస్టల్ సదుపాయం కూడా కల్పిస్తున్నారని అన్నారు. ప్రవేశంపొందిన విద్యార్థులకు లక్షరూపాయలు వారిపేరున బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, కోర్సు పూర్తయిన తరువాత వడ్డీతో సహా వారికి అందిస్తున్నట్లు టిటిడి ఇఓ ఏవిధర్మారెడ్డి వెల్లడించారన్నారు. శనివారం ఉదయం తిరుపతి అలిపిరి వద్ద ఉన్న ఎస్వీ శిల్పకళాశాలను ఉపముఖ్యమంత్రి సత్యనారాయణ, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, సిఇ నాగేశ్వరరావు, టిటిడి సాంకేతిక సలహాదారుడు రామచంద్రారెడ్డి, దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప,కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డితో కలసి సందర్శించారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర శిల్పకళాశాల నిర్వహణ చక్కగా ఉందన్నారు. తెలుగురాష్ట్రాల్లో ఇలాంటి కళాశాల ఎక్కడా లేదన్నారు. అనంతరం రాతివిగ్రహాలు తయారుచేసే విధానాన్ని పరిశీలించారు. విగ్రహాల తయారీకి రాతిని సమకూర్చుకునే పద్ధతులు తెలుసుకున్నారు. కళాశాల ప్రదర్శనశాలలో ఆలయ నిర్మాణము ,శిల్ప,సుధా, లోహశిల్పాలు,సంప్రదాయచిత్రలేఖనం, కలంకారీ పెయింటింగ్ విభాగాలను మంత్రి పరిశీలించారు.



# ప్రతి పేదవాడికి గృహాన్ని అందజేయాలన్నదే ప్రభుత్వ ముఖ్యోద్దేశ్యం

## రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

**విశాఖపట్నం, జూన్ 17, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో గుడివాడలో 8,912లో టిడ్కో గృహాలను సుమారు 800 కోట్ల రూపాయలతో నిర్మించి లబ్దిదారులకు ఇంత పెద్ద స్థాయిలో లబ్దిదారులకు అందచేయడం చెప్పుకోదగ్గ విషయమని, ఇది ఏ ప్రభుత్వంలోను ఇంత పెద్దమొత్తంలో నిర్మించి అందచేయడం విశేషమన్నారు. ఒక్క రూపాయికి ఇల్లు నిర్మించి 1,43,600 గృహాలను ఏ ముఖ్యమంత్రి హయాంలోను జరగలేదని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి గృహాన్ని అందజేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ముఖ్యోద్దేశ్యంగా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

# అనుబంధ ఆలయాల మహాకుంభాభిషేకానికి అధికారులతో పర్యవేక్షణ

**శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పలు అలయాల అభివృద్ధి పనులు పూర్తి అయిన దృష్ట్యా మహాకుంబాభిషేకం నిర్వహించుటకు ఇంజనీరింగ్ అధికారులతో కలసి శనివారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పురాతన కాలం నాటి ఆలయాల జీర్ణోద్ధారణ, పునర్నిర్మాణం కార్యక్రమాలపై దృష్టి సారించారు. ఈ నేపధ్యంలో రూ.6కోట్లతో రాజుల కాలం నాటి ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణం కార్యక్రమాలను చేపట్టారు.పనులు చక చకా జరుగుతున్నాయి.అలాగే అనుబంధ ఆలయాల జీర్ణోద్ధారణ పూర్తి చేసారు.వాటికి 'కుంభాభిషేకం' కార్యక్రమాలు చేపట్టుటకు సాధ్యాసాధ్యాలను శనివారం చైర్మెన్ అంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టిన నాలుగు ఆలయాల జీర్ణోద్ధారణ కార్యక్రమాలను శనివారం ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులు ఇఇ నూకరత్నం,ఎఇఇలు రాజేశ్వరి,శోభారాణి,కిషోర్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి కుంభాభిషేకం చేయటానికి పరిశీలించారు.ఆలయాలకు మహర్దశ కల్పించుటకు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సహకారంతో పనులు చేపట్టారు.ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. ఇఇ,చైర్మెన్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో మహాకుంభాభిషేకంను వైభవోపేతంగా నిర్వహించుటకు ఏర్పాట్లును పరిశీలించారు. ఆలయాల వద్ద పనులు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులను ఆలస్యంగా చేస్తున్నందువల్ల వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ఆధునీకరణ పనులతో పాటు పురాణ ప్రసిద్ది చెందిన అనుబంధ ఆలయాల చరిత్ర భావి తరాలకు అందించే విధంగా రూపకల్పన చేయాలని చైర్మెన్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇంజనీరింగ్ విభాగానికి చెందిన నూకారత్నం,రాజేశ్వరి, శోభారాణి, కిషోర్ కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, మురళి, సూర్యప్రసాద్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాలను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు, ఇఇ నూకారత్నం

# టిటిడి శ్రీవాణి ట్రస్ట్ నిధులపై

## పవన్ ఆరోపణలు అవాస్తవం

## - న్యాయవాది మునిబాలసుబ్రమణ్యం

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం సనాతన హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా పురాతన ఆలయాల మరమ్మతులు, నూతన ఆలయాల నిర్మాణాలు, ధూపదీప నైవేద్యాలకు నిధులు వెచ్చించేందుకు శ్రీవాణి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, తద్వారా నిధులు సేకరిస్తున్న తీరుపై జనసేనాని పవన్‌కల్యాణ్ ఆరోపణలు అర్థరహితమని, అవాస్తవమని వైసిపి లీగల్‌సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి.మునిబాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. 10వేల రూపాయలు ట్రస్ట్‌కు చెల్లిస్తే టిటిడి రశీదు ఇస్తున్నారని, 500 రూపాయలకు విఐపి బ్రేక్ దర్శన టిక్కెట్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. జనసేనాని పవన్ కల్యాణ్ టిటిడి ట్రస్టులపై అవగాహన లేక విమర్శలుచేయడం భక్తుల్లో టిటిడిపై నమ్మకం తగ్గడమే నన్నారు. పవన్ వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. పవన్‌కల్యాణ్‌పై క్రిమినల్ కేసు దాఖలు చేస్తామన్నారు.



# జగ్గయ్యపేటలో రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు

## మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

**జగ్గయ్యపేట, జూన్ 17, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు ఏర్పాటుచేస్తామని ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను ప్రకటించిన విధంగానే పలు రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. 17వ వార్డు పెద్ద రామాయ్య పరిసర ప్రాంతాల్లో దాదాపు రూ.5.22 లక్షల వ్యయంతో నిర్మించ తలబెట్టిన సిమెంట్ రోడ్డు పనులను చైర్మన్ ప్రారంభించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో చెర్వుబజార్‌లో రూ.12 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, పైపులైన్ నిర్మాణ పనులకు ఉదయభాను శంకుస్థాపన చేశారు. అన్ని వార్డుల్లో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాగా పట్టణంలోని తొమ్మిదవ వార్డు కృష్ణానగర్, 25వ వార్డు కబేళా రోడ్డులో దాదాపు రూ.40 లక్షలతో నిర్మించనున్న రోడ్డు, డ్రైన్ పనులకు బుధవారం చైర్మన్ రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను నేతృత్వంలో మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకు రూ.16 కోట్లతో పలు అభివృద్ధి పనులను పట్టణంలో చేపట్టటం జరిగిందన్నారు. అభివృద్ధి పరంపర కొనసాగుతుందని ధీమా వ్యక్తంచేశారు. కాగా కార్యక్రమాల్లో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, దుర్గమ్మ దేవస్థాన ధర్మకర్త నంబూరి రవి, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ మల్లేశ్వరరావు, డిఇఇ కోటేశ్వరరావు, ఏఇ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, పాల్గొన్న కౌన్సిలర్లు

# ఉద్దానానికి ఆపద్బాంధవుడు 'అప్పలరాజు'

## 700 కోట్ల రూపాయలతో ఉద్దానంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి

**పలాస (శ్రీకాకుళం జిల్లా), జూన్ 17 ప్రభాతవార్త** దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి పీడిత బాధితులకు బాసటగా నిలిచి 200 పడకల కిడ్నీ డయాలసిస్, రీసెర్చ్ సెంటర్ మంజూరు చేయించడమే కాకుండా, కిడ్నీ వ్యాధి ప్రబలకుండా 700 కోట్ల రూపాయలతో ఉద్దానంలో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేసి త్రాగునీటి పథకం తెచ్చి ఉద్దాన ప్రజలకు నడిచే దేవుడైపోయారు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు.



**వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యంకు చర్యలు:** శ్రీకాకుళం జిల్లాలో దాదాపుగా 8, 9 మండలాల్లో దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న వారు కొకొల్లలు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధులకు సరైన చికిత్స అందుబాటులో లేదనేది ఎవరూ కాదనలేని నిజం. దీంతో చికిత్స కోసం విశాఖకు వెళ్లడం తప్పనిసరి. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక దయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, పింఛన్ పెంచి ఇవ్వడం, మందులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడంతో కొంత ఉపశమనం దొరికినప్పటికీ పూర్తిస్థాయిలో వ్యాధి నిర్మూల కోసం చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా 200 పడకల ఆసుపత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్న విషయం తెల్సిందే. మరోవైపు సీఎం జగన్ కిడ్నీ వ్యాధిగ్రస్తుల పింఛను 10వేలకు పెంచారు. త్వరలో పలాసలో కిడ్నీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ చర్యల కారణంగా ఉద్దానం ప్రాంతంలో ఇలా ఎంతో మంది కిడ్నీ బాధితులకు ఊరట లభిన్నుంది. వైద్యవరంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. పలాసలో 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి,కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేపట్టారు. రూ.60కోట్లతో నిర్మిస్తున్న రీసెర్చ్ సెంటర్, ఆసుపత్రి నిర్మాణ పనులు 85శాతం మేర పూర్తయ్యాయి. ర్యాంప్ బ్లాక్‌తో కలిపి మూడు బ్లాక్‌లుగా నాలుగు అంతస్తుల్లో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటవుతుంది. మొదటి అంతస్తులో క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, హాస్పిటల్‌స్టోర్స్, సెంట్రల్ ల్యాబ్స్ ఉంటాయి. రెండో అంతస్తులో నెఫ్రాలజీ, యురాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, మూడో అంతస్తులో ఓటి కాంప్లెక్స్, పోస్ట్ ఆపరేటివ్/ఐసీయు, యురాలజీ వార్డులు, రీసెర్చ్ ల్యాబ్స్ ఉంటాయి. వీటి కారణంగా కిడ్నీ రోగులకు భరోసా లభించనుంది. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలతోపాటు పరిశోధన చేయడానికి వీలుగా పరికరాల సమకూర్పు ఉంటుంది. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్యను పరిష్క రించడానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు వందల కోట్ల రూపాయలతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ప్రజల్లో ఉంది. వివిధ ప్రాంతాల్లో కొన్ని ప్రాంతాల్లోకొన్ని మంచినీటి పథకాలు ఉన్నా అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. బాహుదా, మహేంద్రతనయ నదుల నుంచి రక్షిత మంచినీటు సరఫకాకు అవకాశం ఉన్నా వేసవిలో నీరు ఎండిపోతే ప్రజలు బోర్ల నీటిని తాగక తప్పదని గ్రహించిన జగన్ సర్కార్ మొదట్లోనే భారీ ప్రతిపాదనను తీసకుని వచ్చింది. ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేస్తున్న ఈ వాటర్ గ్రిడ్ కిడ్నీ రోగలకు వరం అని చెప్పవచ్చు. ఉద్దానం ప్రాంతంలో ఉన్నటువంటి 20వేల మంది అన్ని రకాల కిడ్నీ రోగులకు వాటర్‌గ్రిడ్ వరంగా మారిపోతుంది. గ్రామాల్లో ట్యాంకులు ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా నదీ జలాలు అందించనున్నారు. ఇదిజరిగితే భూగర్భంలో ఉన్నటువంటి సిలికాన్ కారణంగా కిడ్నీ వ్యాధులు వస్తున్నాయనే అనుమానాలు సైతం తొలగిపోతాయి. ఈ పథకం ప్రారంభం కావడం ద్వారా సిఎం వైఎస్ జగన్ మరింత మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో ఎలాంటి సందేహం లేదు. శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పరిధిలో 170 నివాసిత ప్రాంతాలకు తాగునీరు అందించే అవకాశం ఉంది.

# మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏం చేశావ్!

## - మాజీ సిఎం చంద్రబాబునాయుడుపై డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఫైర్

**పాలసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త:** రాష్ట్రానికి మూడు సార్లు ముఖ్యమంత్రిగా వుండి ప్రజలకు ఏం చేశావ్! ఎన్టీఆర్ పేరు చెబితే రూ.2 కిలో బియ్యం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్, సిఎం వైస్ జగన్ పేరు చెబితే నవరత్నాలు గుర్తుకు వస్తాయి! నీ పేరు చెబితే ఏం గుర్తుకు వస్తాయో చెప్పాలని డిప్యూటీ సిఎం మాజీ సిఎం చంద్రబాబునాయుడును ప్రశ్నించారు. పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజపురం సచివాలయ పరిధిలో శనివారం మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఇటీవల మాజీ సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో మైకు పెట్టుకొని తనకు మరొక్క ఛాన్స్ ఇవ్వాలని ప్రజలను వేడుకొంటున్నారని, మూడు సార్లు సిఎంగా వుండి ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఏమి చేశారో చెప్పాలని డిప్యూటీ సిఎం మాజీ సిఎంను ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం మాజీ సిఎం చంద్రబాబునాయుడు తన ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేస్తారని, వార్డు సభ్యుడిగా సైతం గెలవని ఆయన కుమారుడు నారా లోకేష్ సిఎం వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 2024 ఎన్నికల్లో సత్తా వుంటే సింగిల్‌గా పోటీ చేసి విజయం సాధించాలని మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడుకు డిప్యూటీ సిఎం సవాల్ విసిరారు. శ్రీకావేరిరాజపురం గ్రామంలో ఓ మహిళతో మాట్లాడుతూ డిప్యూటీ సిఎం గ్రామంలో అత్యధికంగా పూరిండ్లు వున్నాయని, మళ్ళీ తాను 3 నెలల అనంతరం వస్తానని అప్పటికి ఇల్లు నిర్మించుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి అందని సమస్యలను పరిశీలించి 60 రోజుల్లో పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పీటిసీ అన్బుగలన్, మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ గాలి మహేష్, ఆర్‌బికె చైర్మన్ పోలయ్య, వైకాపా సీనియర్ నాయకురాలు ఇందిరమ్మ, నాయకులు శివప్రకాష్‌రాజు, పుత్తూరు కేశవరెడ్డి, సుందర్‌రాజు, తహసిల్దారు బాబు, ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎస్ఐ సురేష్, ఎఎస్ఐలు మురుగేష్, చక్రవర్తి, హెల్త్ ఆఫీసర్ జ్ఞానశేఖర్, ఎఓ ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి

# రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి - మరో 9మందికి తీవ్ర గాయాలు



**ఆలమూరు, జూన్ 17,ప్రభాతవార్త :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి 216ఏ నెంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మరో 9 మందికి తీవ్ర గాయాలైనట్లు రావులపాలెం సిఐ రజిని కుమార్, ఆలమూరు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముద్దుర్తి నుండి కోనసీమ జిల్లా మందపల్లి టాటా ఏసీ వాహనంలో 9మంది రాజమహేంద్రవరం వైపు నుండి రావులపాలెం వైపు వస్తుండగా అదే మార్గంలో విశాఖపట్నం నుండి పాలకొల్లు నలుగురితో వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదంలో టాటా ఏసీ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో టాటా ఏసీలో ప్రయాణిస్తున్న ముద్దుర్తికి చెందిన ప్రతివాడ కన్నయ్య లింగం (55), బోడి వెంకి నాయుడు(55), గంగిరెడ్ల శ్రీను (38) సంఘటన స్థలంలోనే మృతిచెందగా అదే వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కారు రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వేగేస్ని సుబ్రహ్మణ్యం రాజు సంఘటన స్థలంలో మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులందర్ని 108 అంబులెన్స్‌లపై రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి కొత్తపేట డిఎస్పి కె.వెంకటరమణ, రావులపాలెం సిఐ రజిని కుమార్, ఎస్సై శివప్రసాద్ సంఘటన స్థలానికి హుటాహుటీన చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే జాతీయ రహదారుల సూపర్‌వైజర్ రమేష్, టోల్ మేనేజర్ నెహేమియా, హైవే అధికారి రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## సంతాన సామర్థ్యాన్ని పెంచే జామ !

పచ్చగా నవనవలాడే జామ పండుని చూసి మనసు పారేసుకోనివారెవరో చెప్పండి. అయితే, ఇది రుచిలోనే కాదు.. పోషకాలను శరీరానికి అందించడంలోనూ మేటే, మరి ఈ పోషకాల ప్రయోజనాలు తెలుసుకుందామా !

- జామపండులో పీచు ఎక్కువ. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువ. అందువల్లే మనకు ఆకస్మాత్తుగా చక్కెర నిల్వలు పడిపోకుండా చేసి సమతుల్యంగా ఉంచుతుంది. అలాగే రక్తపోటునూ అదుపులో ఉంచుతుంది. ఇందులోని ట్రైగ్లిజరాయిడ్లు చెడు కొవ్వుని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- జామలో విటమిన్ సి, లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. ఇక ఈ పండులో ఉండే



మెగ్నీషియం. శరీరం ఇతర పోషకాలను సరిగా స్వీకరించేలా చేస్తుంది.

- జామ శరీరం నుంచి హానికారక ఫ్రీరాఢికల్స్‌ను బయటకు పంపి. శరీరంలో క్యాన్సర్ కణాలు వృద్ధికాకుండా అడ్డుకుంటుంది. బ్రెస్ట్ క్యాన్సర్ నిరోధకంగానూ పనిచేస్తుంది.
- ఫైబర్ ఎక్కువగా ఉండే జామపండు జీర్ణ ప్రక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది. ఇక ఇందులోని ఫోలేట్ సంతాన సామర్థ్యాన్ని పెంచితే. ఫోలిక్ యాసిడ్ గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. ❑

# నాన్నకు ప్రేమతో ..








ఓ నాన్న.. నీ మనస్సేవెన్న, అమృతం కన్న అది ఎంతో మిన్న.. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి అన్నట్లు నాన్న గురించి ఎన్ని ఉపమానాలు చెప్పినా అవి తక్కువే. జన్మకు కారకుడై, అభివృద్ధికి బాటలు వేసి అహర్నిశలు కుటుంబానికి అండగా నిలిచే నాన్నను గౌరవించుకోవలనే సంకల్పంతో ఏర్పడించే పితృదినోత్సవం. ప్రతిసంవత్సరం జూన్ మూడో ఆదివారం రోజున ఫాదర్స్‌డే జరుపుకోవటం అనేది సాంప్రదాయంగా మారుతోంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 52 దేశాలు తండ్రుల గౌరవార్థం ఈ దినోత్సవాన్ని జరుపుతున్నాయి. బాధ్యతకు మారుపేరుగా నిలిచే తండ్రులకు కూడా ఒక రోజును కేటాయించాలని అమెరికాకు చెందిన 'సొనోరాస్మార్డ్‌డాడ్' అనే మహిళ ప్రచారానికి అనుగుణంగా 1910లో మొదటి సారిగా ఫాదర్స్‌డేను జరుపుకున్నారు. దీనికి ఆదరణ పెరిగి 1972 నుంచి ప్రపంచదేశాలు పితృదినోత్సం ఘనంగా జరుపుకుంటున్నాయి. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతూ అనునిత్యం వారి అభివృద్ధి గురించే ఆలోచిస్తూ ఉండే తండ్రికి మనం ఏమిచ్చినా రుణం తీరదు. తండ్రి సేవల్ని గుర్తుచేసుకుని ఆయన్ని గౌరవించుకోవడానికి ఈ ఫాదర్స్ డే ఒక అద్భుత అవకాశంగా మలుచుకోవచ్చు. అమ్మ ప్రేమ ప్రత్యక్షమయితే నాన్న ప్రేమ పరోక్షం అని చెప్పవచ్చు. పిల్లల అవసరాలను తీర్చడం కోసం ఎంత కష్టమైనా భరిస్తాడు. పిల్లల కళ్ళలో ఆనందం చూడాలని తహతహలాడతాడు. వాళ్లకి ఒక మంచి జీవితాన్ని అందించాలని ఆశిస్తాడు. వారి సంతోషమే తన ఆనందంగా భావిస్తాడు. అందుకే నాన్నంటే ఒక బలం ఒక బాధ్యత నాన్నంటే అనంత శక్తి, అఖండస్ఫూర్తి. అందుకే ఫామ్ బ్రౌన్ ఈ విధంగా అంటాడు 'తండ్రులు సాధారణమైనవారు. వాళ్ళ ప్రేమ ద్వారా హీరోలు, సాహిసికులు, స్టోరీ టెల్లర్లు, పాటల గాయకులుగా మారతారు.' నాన్నంటే లోకాన్ని చూపించే మార్గదర్శి, తప్పటడుగులు సరిదిద్ది బిడ్డల భవిష్యత్తు కోసం తపన పడే నిస్వార్థపు మనిషి. నాన్నంటే ఒక ధైర్యం.. ఓ భరోసా భద్రత. పైకి గంభీరంగా కనిపించినా మనస్సులో అనంత ప్రేమానురాగాన్ని నిక్షిప్తం చేసుకుంటాడు. ఓర్పుకి, సహనానికి, నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం నాన్న.



నాన్న మాటల్లో ప్రేమ, చేష్టల్లో బాధ్యత గోచరిస్తాయి. ఆయన కష్టం అంతా తెర వెనుకే ఉండిపోతుంది. కష్టఫలితం మాత్రం బిడ్డలు ఆనందంగా అనుభవిస్తుంటే అది చూసి నాన్న మనస్సు ఆనందంతో నిండిపోతుంది. బాల్యం నుంచి మనల్ని పెంచి, పోషించి అభివృద్ధి పథంలో నడిపించిన అమ్మనాన్నల్ని మనం పెద్దయ్యే సరికి వాళ్ళు వృద్ధులవుతారు. వాళ్ల పనులు వాళ్ళు చేసుకోలేనంత బలహీనులవుతారు. వాళ్ల పనులు వాళ్ళు చేసుకోలేనంత బలహీనులవుతారు. అటువంటప్పుడు వాళ్లను కనిపెట్టుకుని ఉండి వారి అవసరాలు తీరుస్తూ వాళ్లకు కష్టం కల్గకుండా చూసుకోవడం మన బాధ్యత ధర్మం అంటాడు శ్రవణకుమారుడు అదే స్ఫూర్తిగా తీసుకుని గాంధీజీ కూడా తన తండ్రి కరంగాంధీని అపురూపంగా చూసుకుంటూ సేవచేశాడు. సమాజంలో తండ్రి పాత్రను గుర్తించేందుకు ఫాదర్స్‌డే జరుపుకోవడం అంటే నాన్నను గౌరవించుకోవడమే. నాన్నల్ని వారి త్యాగాలను స్మరించు కోవడం మనందరి బాధ్యత. పిల్లలను ఎలాంటి లోటూ లేకుండా వారి బాగోగులు చూసే తండ్రుల త్యాగనిరతికి కొలమానాలు లేవు. ఉండవుకూడా. మరి ముసలివారైనా తండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పించే కొడుకులు రూపు వారు ముసలి వారైన తర్వాత తమ బిడ్డలు తమని కూడా అలానే చూస్తారనే సంగతి గ్రహిస్తే తండ్రుల మనస్సు ఎలా ఉంటుందో బిడ్డలు ఆలోచించాలి. అసలు మన భారతీయ సాంప్రదాయం ప్రకారం, మాతృదేవోభవ, పితృదేవోభవ అంటూ నిత్యం వారిని స్మరించుకోవటం ఆనవాయితీగా వస్తుంది ఆ సాంప్రదాయాన్ని నేటి తరంవారు అర్థం చేసుకుని ఆచరిస్తే ఎంతో మంచిది. తల్లిదండ్రులకు మించిన దైవంలేదని, ప్రపంచానికి నిన్ను పరిచయం చేసింది అమ్మ అయితే, ప్రపంచాన్ని నీకు పరిచయం చేసేది నాన్న అని బిడ్డలు గ్రహించగల్గితే నాన్నలు ఎంతో సంతోషిస్తారు. తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. తల్లిదండ్రుల రుణం తీర్చడం అసాధ్యం అయినప్పటికి బిడ్డలు కనీసం శ్రద్ధ వహించి వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలి.

**యస్మాత్వార్థివ దేహః ప్రామర భూద్యేన భగవతా గురుణా** ఎవరివల్ల ఈ భౌతిక శరీరం జన్మించిందో అలాంటి భగవత్ స్వరూపుడు, సర్వజ్ఞుడు అయిన తండ్రికి సహస్రనమస్సులు' అని అర్థం.

**- రేపాక రఘునందన్**

## చెలి చిట్కా



దుస్తులపై పడే పరిమ ళాల మర కల్ని తొల గించా లంటే.. ఆప్రాంతంపై వెనిగర్, నీళ్లు కలిపి చల్లండి. కాసేపయ్యాక రుద్ది ఉత్తికితే సరిపోతుంది. ❑

# శిరోజాల ఆరోగ్యానికి స్క్రబ్బింగ్

వేడి చర్మంపైనే కాదు, మాడుపైనా ప్రభావం చూపిస్తుంది. చర్మం పెళుసుబారి చుండ్రు సమస్య మొదలవుతుంది. దురదతోపాటు జుట్టు రాలే సమస్యకు ఇది దారి తీస్తుంది. దీన్ని నిరోధించాలంటే మాడును ఆరోగ్యంగా ఉంచుకోవాలంటున్నారు నిపుణులు.

**కాఫీపొడితో..** తల స్నానానికి అరగంట ముందు గోరువెచ్చని కొబ్బరి నూనెతో తలకు మర్దనా చేసుకోవాలి. చెంచా కాఫీపొడికి రెండు చెంచాల ఆలివ్‌నూనె కలిపిన మిశ్రమాన్ని మాడుకు పట్టించాలి. 20 నిమిషాలు ఆరనిచ్చి గోరువెచ్చని నీటిని తలపై చిలకరించి ముని వేళ్లతో మృదువుగా రుద్దాలి. దీంతో మాడుపై మృత కణాలు దూరమై, చర్మంలో రక్తప్రసరణ మెరుగవుతుంది. శిరోజాలనూ రాలనివ్వదు.

**దాల్చినచెక్కతో..** చెంచా వంటసోడాలో అరచెంచా దాల్చిన చెక్కపొడి, రెండు చెంచాల ఆలివ్‌నూనె వేసి బాగా కలపాలి. జుట్టును చిన్నచిన్న పాయలుగా విడదీసి మాడుకు మాత్రం పట్టేలా ఈ మిశ్రమాన్ని రాయాలి. అరగంట ఆరనిచ్చి, తలస్నానం చేస్తే మృతకణాలు దూరమవుతాయి. మాడు మృదువుగా మారి, చర్మ రంధ్రాలు శుభ్రపడి శిరోజాలకు తగిన రక్తప్రసరణ జరుగుతుంది. చుండ్రు, దురద వంటి సమస్యలన్నీ మాయమవుతాయి.



**చక్కెరతో..** మూడు చెంచాల చక్కెరకు రెండు చెంచాల కొబ్బరినూనె, రెండు మూడు చుక్కల టీ ట్రీ ఆయిల్ లేదా లావెండర్‌నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి మృదువుగా రుద్దాలి. పావుగంట తర్వాత రసాయనాల్లేని షాంపుతో తలస్నానం చేస్తే, మృత కణాలు తొలగి మృదువుగా మారుతుంది. ❑

# పచ్చిపులుసు రుచులు

పచ్చి పులుసు క్షణాల్లో వండేయొచ్చు. నూనెలు, మసాలాల గోల ఉండదు. రుచిలో రాజీలేదు. దేని గురించి అనుకుంటున్నారా? తేలిగ్గా చేసుకునే పచ్చిపులుసు గురించి. అలాగని అలుసొద్దండోయ్! వేర్వేరు పదార్థాలతో చేసుకొనే ఈ పచ్చిపులుసులని మీరూ ప్రయత్నించండి..

## పచ్చి మామిడితో..

**కావాల్సినవి :** పచ్చి మామిడికాయలు–2, నీళ్లు–2 కప్పులు, ఉల్లిపాయ–1 , ఎండుమిర్చి–2, పచ్చిమిర్చి–రెండు, నూనె–చెంచా, ఆవాలు–పావు చెంచా, జీలకర్ర–పావు చెంచా, కరివేపాకు–రెండు రెబ్బలు, కొత్తిమీర తరుగు–చెంచాన్నర, ఉప్పు–రుచికి తగినంత బెల్లం–2 చెంచాలు.



**తయారీ :** కుక్కర్‌లో మామిడికాయలని తగినన్ని నీళ్లుపోసి మెత్తగా ఉడికించుకోవాలి. చల్లారిన తర్వాత తొక్క టెంక తీసేసి గుజ్జుని వేరుచేసి పెట్టుకోవాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టుకొని నూనెపోసి వేడి చేసుకోవాలి. ఆవాలు, జీలకర్ర చిటపటలాడనివ్వాలి. తర్వాత ఎండుమిర్చి, సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి ఒక నిమిషం వేయించి స్టౌ కట్టేయాలి. ఒక గిన్నెలోకి మామిడికాయ గుజ్జు, తగినంత నీరు, ఉప్పు, బెల్లం, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు వేసి కలిపి, దీనికి తాలింపుకలుపుకోవడమే వేడి అన్నంలోకి బాగుంటుంది. పోషకాలపరంగానూ మంచిది.

## పల్లీ పచ్చిపులుసు



**కావాల్సినవి :** పల్లీలు–అరకప్పు, నల్ల నువ్వులు–చెంచా, బెల్లం–చెంచాన్నర, వెలుల్లి రెబ్బలు–నాలుగు, కారం–చెంచాన్నర, పసుపు–అరచెంచా, ధనియాలు పొడి–2 చెంచాలు, చింతపండు గుజ్జు–రెండు చెంచాలు, నీళ్లు 2 కప్పులు, ఉప్పు–రుచికి తగినంత, నూనె–చెంచా, ఉల్లిపాయ–ఒకటి, ఎండు మిరపకాయ–1, ఆవాలు–జీలకర్ర–అరచెంచా, కరివేపాకు–2 రెబ్బలు, కొత్తిమీర తరుగు–చెంచాన్నర.

**తయారీ :** బాణలిలో పల్లీలని తక్కువ మంట మీద బాగా వేయించి చల్లారాక పొట్టు తీసుకోవాలి. వేయించిన పల్లీలు, నువ్వులు, బెల్లం, వెల్లుల్లి, కారం, పసుపు, ధనియాలపొడి అన్నీ కలిపి మిక్సీలో మెత్తగా పేస్ట్‌లా గ్రైండ్ చేసి తగినంత నీరు కలిపి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. తర్వాత చింతపండు రసం కూడా కలపాలి. కడాయిలో నూనె వేసి వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి కరివేపాకు వేసి వేగాక ఉల్లిపాయ ముక్కల్ని వేయించుకోవాలి. ఇందులోకి గ్రైండ్ చేసిన మిశ్రమం, తగినంత ఉప్పువేసి రెండు మూడు నిమిషాలు ఉలికించుకుంటే చాలు చివరిగా కొత్తిమీర తరుగు వేసుకుంటే వేడి అన్నంలోకి పల్లీ పులుసు బాగుంటుంది.

## టొమాటోతో ..

**కావాల్సినవి :** టొమాటోలు–నాలుగు, వెల్లుల్లి రెబ్బలు–ఆరు, ఉల్లిపాయ–ఒకటి, పిచ్చిమిర్చి–2, కొత్తిమీర తరుగు–చెంచాన్నర, ఉడికించిన బంగాళాదుంప–ఒకటి, ఉప్పు–రుచికి తగినంత.



**తయారీ :** టొమాటోలని ఫోర్క్‌తో గుచ్చి గ్రిల్‌పైన ఉంచి స్టౌమీద పెట్టి అన్నివైపులా కాల్చుకోవాలి. ఇలా వెల్లుల్లిరెబ్బలు, ఉల్లిపాయ, పచ్చిమర్చి, ఆలుగడ్డని కూడా కాల్చాలి. ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కాలిన నల్లని పొరని చేత్తో తీసుకోవాలి. కొత్తిమీర తరుగుతోపాటు ఒక గిన్నెలోని వీటిని తీసుకుని తగినంత ఉప్పువేసి మెత్తగా మెదుపుకోవాలి. కొద్దిగా నీళ్లు కూడా కలుపుకోవచ్చు. ఈ పచ్చిటొమాటో పులుసుని పకాళీబాత్‌తో అంటే చద్దన్నంతో కలిపి తింటారు. రోటీల్లోకి కూడా బాగుంటుంది. ఆరోగ్యప్రదం కూడా.

## నువ్వులు పచ్చిపులుసు..

**కావాల్సినవి :** నువ్వులు–50గ్రా, పల్లీలు–50గ్రా, జీలకర్ర–అరచెంచా, కరివేపాకు–రెండు రెబ్బలు, పచ్చి మిరపకాయలు–రెండు, ఉల్లిపాయ–ఒకటి, కొత్తిమీర తరుగు–చెంచాన్నర, ఉప్పు–తగినంత, కారం–చెంచా, బెల్లం–చెంచాన్నర, చింతపండు, గుజ్జు–2 చెంచాలు.



**తయారీ :** ముందుగా నువ్వులు, పల్లీలు, జీలకర్రని విడివిడిగా వేయించుకొని అన్నింటినీ కలిపి పొడి చేసుకోవాలి. ఈ పొడిలో కావలసినంత చింతపండు గుజ్జు వేసుకుని, కావాల్సిన పరిమాణంలో నీళ్లు కలుపుకోవాలి. సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, ఉప్పు, బెల్లం వేసుకుంటే నువ్వుల పచ్చిపులుసు సిద్ధం. నోటికి రుచిగా చాలా బాగుంటుంది.

## వంకాయతో..

**కావాల్సినవి :** నూనె–2 చెంచాలు, వంకాయలు–రెండు, పచ్చిమిర్చి–4, నీళ్లు–తగినన్ని, ఆవాలు–అరచెంచా, జీలకర్ర–అరచెంచా, కరివేపాకు–రెబ్బ, పసుపు–పావుచెంచా, చింతపండు రసి–కప్పు, నువ్వులు –చెంచా, ఉల్లిపాయ–1, ఉప్పు–రుఇకి తగినంత.

**తయారీ :** వంకాయలని కాల్చడానికి గ్రిల్‌లాంటిదాన్ని తీసుకోవాలి. వంకాయలకి కొద్దిగా నూనెరాసి, పచ్చిమిర్చి కూడా తీసుకుని గ్రిల్‌పై ఉంచి అన్ని వైపులా కాల్చుకోవాలి. ఇవి చల్లారాక పొట్టు తీసేసి మెత్తగా మెదిపి పెట్టుకోవాలి. బాణలిలో కొద్దిగా నూనె పోసి వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పసుపు వేసి స్టౌ కట్టేయాలి. ఒక గిన్నెలో చింతపండు రసం, తగినన్ని నీళ్లు, మెదిపిన వంకాయ, పచ్చిమిర్చి మిశ్రమం, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి కలిపి చివరిగా తాలింపు వేసి కలుపుకోవాలి. నువ్వులను వేయించి, చల్లారాక పొడికొట్టి దాన్ని పచ్చి పులుసులో వేసి కలపాలి. ఈ వంకాయ పచ్చిపులుసు అన్నంలోకి బాగుంటుంది. ❑



# ఇతరులకు మేలు చేద్దాం

అంతర్వాణి

'యెహోవా, నీ గుడారములో అతిథిగా ఉండదగిన వాడెవడు? నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగినవాడెవడు?' యథార్థమైన ప్రవర్తన గలిగి నీతి ననుసరించుచు హృదయపూర్వకముగా నిజము పలుకువాడె. అట్టివాడు నాలుకతో కొండెములాడడు, తన చెలికానికి కీడు చేయడు, తన పొరుగువానిమీద నింద మోపడు' (కీర్తన 15:1, 2). ఈ కీర్తన దావీదు మహారాజు రాశాడు. ఇందులో మనం నేర్చుకోవాల్సినవి, తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయి. అసలు దేవుడి సన్నిధిలో ఎవరు ఉండగలరు? ఆయనను ఎవరు సేవించగలరు? నీతి, నిజాయితీ అనేవి చాలా ముఖ్యం. మన స్వనీతిని పెంచుకోవడం కాదు, ఎదుటివారికి కీడు చేయకుండా చూసుకోవడం కూడా ముఖ్యమైనదే. మొదట మన ప్రవర్తన నిజాయితీగా ఉండాలి. నటించే భక్తిజీవితం మనకుండకూడదు.



అంతేకాదు అబద్ధాలు చెప్పకూడదు, మన పొరుగువారికి కీడు చేయకూడదు. వారిపై లేనిపోని నిందల్ని మోపకూడదు. లంచాలు అసలు తీసుకోకూడదు. ఈవిధంగా జీవించేవారు ఎన్నడు కదల్చబడరని దావీదు తన అనుభవాని న్ని చెబుతున్నాడు. అవును దేవుడు ప్రేమ అయి ఉన్నాడు. ప్రేమ ఎప్పుడూ ఇతరులను ప్రేమిస్తూనే ఉంటుంది. వారికి కీడు చేయాలని అనుకోదు. మనల్ని ప్రేమించే వారినే మనం ప్రేమిస్తాం. కానీ మనల్ని ద్వేషించేవారిని ప్రేమించడం చాలా కష్టం. అదే యేసుక్రీస్తు తనని ద్వేషించేవారిని సైతం ప్రేమించి, పరలోకరాజ్యం, మారమనసు గురించి ప్రకటించాడు. తనను వదిలేసి పారిపోయిన 11మంది శిష్యులను ప్రభువు ప్రేమించి, తాను పునరుత్థానం అయిన తర్వాత వారికి ప్రత్యక్షమై, వారికి ప్రేమతో కౌన్సెలింగ్ ఇచ్చి, తన మహిమగల సువార్తను బోధించే ధన్యతను ఇచ్చాడు. ఆ సువార్తే నేడు మన వరకు వచ్చి, దేవాదిదేవుడైన యేసుక్రీస్తును ఆరాధించే గొప్ప ధన్యత మనకు లభించింది. కాబట్టి మనం దేవుడి మందిరంలో, ఆయన గుడారంలో ఎప్పుడు నివసించగలం అంటే నీతి, నిజాయితీని అనుసరిస్తూ, ఇతరులకు కీడు చేయకుండా ఉన్నప్పుడు మాత్రమే సుమా! చేతనైతే ప్రతివారికీ మేలు చేద్దాం. లేకపోతే మౌనంగా ఉందాం. దేవుడు మనల్ని మనం చేసింది ఏమిటి అని అడుగుతాడే తప్ప, ఎందుకు చేయలేదని అడగడు. కాబట్టి మనం జీవించే ఈ కొద్ది జీవితం ప్రభువు కోసం జీవిద్దాం.

**-పి.వాణిపుష్ప**

# ఏ బ్యాగు ఎంచుకుందాం..

ఒకప్పుడు హ్యాండ్ బ్యాగ్ అంటే.. అలంకరణలో ఓ భాగం. ఇప్పుడు గడపదాటి బయటికెళ్లే ప్రతి అమ్మాయి నిత్యావసరం. అందుకే ఇది ట్రెండీగా ఉండాల నుకుంటోంది ఈ తరం. అయితే. దీన్ని సౌకర్యంగానూ ఎంఉకోవాలంటారు నిపుణులు. అదెలాగంటే..



- బ్యాగుని ఎంచుకునేటప్పుడు కంటికింపుగా కనిపించడమే కాదు దాని నాణ్యతా చూసుకోవాలి. మీ అవసరాన్నీ దృష్టిలో పెట్టుకుని ఎంచుకోవాలి.
- అందరికీ ఒకే తరహా బ్యాగులు నప్పకపోవచ్చు. మీ శరీరాకృతికి సరిపోయే రకాన్ని ఎంచుకోవడం మేలు. ఉదాహరణకు మీరు సన్నగా, పొడవుగా ఉంటే పెద్ద పెద్ద స్ట్రాప్‌లు, స్లింగ్ రకాల జోలికి పోవద్దు. టోటే, బెర్యుడా హోబో, క్లచ్ రకాలు బాగుంటాయి.
- ఎత్తు తక్కువగా ఉన్నవారికి ఓవర్ సైజ్ బ్యాగులు అంతగా నప్పవు. మీడియం రకాల్ని ఎంచుకోవాలి. సాచెల్, టోటే, క్రాస్‌బాడీ రకాలు నప్పుతాయి. ❑

# టీమ్ బంగ్లాదేశ్ ప్రపంచ రికార్డు

## 546 పరుగులతో అఫ్ఘానిస్థాన్ ఓటమి



**ఢాకా:** టెస్టుక్రికెట్‌లో బంగ్లాదేశ్‌ప్రపంచ రికార్డుసృష్టించింది. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఏకంగా 546 పరుగుల తేడాతో విజయం సాధించింది. 21వ శతాబ్దంలో టెస్టుక్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతోగెలిచిన జట్టుగాప్రపంచ రికార్డు సృష్టించింది. ఓవరాల్‌గా చూసుకుంటే ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ 675 పరుగుల తేడాతో 1928లో విజయంసాధించి అగ్రస్థానంలో ఉండ గా ఇంగ్లండ్‌పై ఆసీస్ 562 పరుగుల తేడాతో 1934లో గెలిచి రెండోస్థానంలో నిలిచింది. ఇక బంగ్లాదేశ్ ఆఫ్ఘన్ మ్యాచ్‌పరంగాచూస్తే తొలి ఇన్నింగ్స్‌లో ఆరుపరుగులకే మొదటి వికెట్ నష్టపోయిన బంగ్లాదేశ్, నజ్ముల్‌హుస్సేన్ షాంటో 146పరుగులుచేసాడు. ఆతడికి తోడుగా మహ్మదుల్లా హసన్ 76, ముష్ఫికర్ రహీమ్ 47, హసన్‌మిరాజ్ 48 పరుగులతో రాణించడంతో జట్టు 382 పరుగులుచేసింది. బంగ్లా బౌలర్ల ధాటికి ఆఫ్ఘనిస్తాన్ 146 పరుగులకే కుప్పకూలింది. అఫ్సర్ జాజయ్ 36 టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగుల ఆధిక్యం సంపాదించిన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోను భారీస్కోరుచేసింది. నజ్ముల్ హుస్సేన్ షాంటో 124 మరోసారి శతకంతో విరుచుకుపడ్డాడు. మోమినుల్ హక్ 121పరుగులతో సెంచరీ చేయడంతో 425/4 వద్ద బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్‌చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలిన ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో అంతకంటే తక్కువ స్కోరుకే చేతులెత్తేసింది. తస్కిన్ అహ్మద్ 4/37, షారిపుల్ ఇస్లాం 3/28 చెలరేగడంతో ఆఫ్ఘన్ జట్టు 115పరుగులకే కుప్పకూలింది. దీనితో బంగ్లాదేశ్ రికార్డు స్థాయి విజయం సొంతంచేసుకోగలిగింది.



## యాషెస్ సిరీస్‌లో తొలిరోజే

# ఇంగ్లండ్ ఇన్నింగ్స్ డిక్లేర్!

**లండన్:** ఇంగ్లండ్‌క్రికెట్ టీమ్ టెస్టుల్లో బజ్‌బాల్ అంటూ తెగ హడావిడిచేస్తోంది. ఈ వైఖరితో ఆజట్టు చాలా మ ఆ్యచ్‌ల్లో గెలిచి భారీ విజయం సాధించింది. తాజాగా ఆజట్టు యాషెస్‌సిరీస్ తొలిటెస్టులోనూ బజ్‌బాల్ ఫార్ములానే ఉపయోగించి తొలి ఇన్నింగ్స్‌ను తొలిరోజే డిక్లేర్‌చేసి సాహసనిర్ణయం ప్రకటించింది. ఈ ఇనర్ణయం ఇంగ్లండ్‌కు మరో విజయం సాధించి పెడుతుందో లేక ఆజట్టు కొంపముంచుతుందో తేలాలంటే మరికొద్ది గంటలు వేచిచూడాల్సిందే. లంచ్ విరామం సమయానికి 78/3తో ఉన్న ఇంగ్లండ్ వైపై ఆట మొగ్గుఉతన్నా మరికొంది గంటలు గడచేవరకూ ఏమి చెప్పలేనిపరిస్థితి ఏర్పడింది. లంచ్ తర్వాత ఆసీస్ గేర్‌మార్చి వేగంగాపరుగులుసాధిస్తుండటంతో మ్యాచ్‌ఫలితం ఎలా ఉండబోతున్నదోనని అభిమానులు ఆతృతగా వెయిట్‌చేస్తున్నారు. 45 ఓవర్లుముగిసేసమయానికి ఆసీస్ మూడు వికెట్లు కోల్పోయి 148 పరుగులవద్ద ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది. ఉస్మాన్‌ఖ్వాజా 66, ట్రావిస్ హెడ్ 50 పరుగులతోక్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ఆసీస్ ఇంకా 245 పరుగులు వెనకంజలో ఉంది. ఈమ్యాచ్‌లో టాస్ గెలిచి తొలతుత బ్యాటింగ్‌చేసిన ఇంగ్లండ్ జోరూట్ 118 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. జాక్‌క్రాలే 61, బెయిర్‌స్టో 78 పరుగులతోరాణించారు. 393/8 పరుగులవద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్‌చేసింది. ఆసీస్ బౌలర్లలో నాథన్ లయోన్ నాలుగుహాజిల్ వుడ్ రెండు, బోలండ్, గ్రీన్ తలో వికెట్‌తీసారు. అనంతరం తొలిరోజే తొలి ఇన్నింగ్స్‌ప్రారంభించిన ఆసీస్ ఆటముగిసేసమయానికి వికెట్‌నష్టపోకుండా 14పరుగులుచేసింది.

## ఫైనల్స్‌కు దూసుకువెళ్లిన

# సాత్విక్‌చిరాగ్ జోడీ



**జకార్తా:** ఇండోనేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్‌చిరాగ్ జోడీ సంచలన ఆటతో ఫైనల్‌కు దూసుకువెళ్లింది. పురుషుల డబుల్స్‌లో హోరాహోరీగా సాగిన సెమీస్‌లో ఎంహెచ్ కాంగ్ ఎస్‌జే సియో(దక్షిణకొరియా) జోడీపై 17-21, 21-19, 21-18 తేడాతో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించారు. ఈక్రమంలో సూపర్ 1000 టోర్నమెంట్‌ఫైనల్‌కు చేరిన మొదటి భారత జోడీగా రికార్డు సృష్టించారు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో సాత్విక్ చిరాగ్ జోడీ 21-13, 21-13 తేడాతో టాప్‌సీడ్ ఇండోనేసియా జోడీ ఫజర్ ఆల్ఫియాన్, మహ్మద్‌రియాన్‌లపై విజయం సాధించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిరాశపరిచాడు. టాప్ సీడ్ అక్సెలెన్స్ (డెన్మార్క)తో జరిగిన సెమీస్‌లో 21-15, 21-15 తేడాతో ఓటమి పాలయి టోర్నీనుంచి నిష్క్రమించాడు. అక్సెల్సెన్ ఫైనల్‌లో లీషిపెంగ్(చైనా)లేదా ఇండోనేసియాకు చెందిన సినిసుకా గింటింగ్‌తో తలపడతారు.

# నేను కెప్టెన్ అయి ఉంటే డిక్లేర్‌చేయను

## ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్



**లండన్:** యాషెస్‌సిరీస్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో బజ్‌బాల్ వ్యూహం అమలుచేస్తూ ధనాధన్ బ్యాటింగ్‌తో తొలిరోజే తొలి ఇన్నింగ్స్‌నుఉ 393/8వద్ద ఇంగ్లండ్ డిక్లేర్‌చేసింది. అయితే కెప్టెన్ బెన్‌స్టోక్స్ తీసుకున్న నిర్ణయాన్ని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ తప్పుపట్టాడు. నేను కెప్టెన్ అయి ఉంటే డిక్లేర్‌చేసేవాడిని కాదని, ఏంజరుగుతుందో మీకు తెలియదు. ఇంతకుముందు ఏజట్టుచేయని సాహసాన్ని చేయడానికి ఇంగ్లండ్ ప్రయత్నిస్తోందని, నేను కెప్టెన్‌గా ఉంటే జోరూట్‌క్రీజులో ఉన్నందున జట్టుకు మరిన్ని పరుగులు కావాలని భావించేవాడినని అన్నాడు. బెన్‌స్టోక్స్ నిర్ణయం చాలామంది క్రికెట్‌పండితులను షాక్‌కు గురిచేసినప్పటికీ తనకు మాత్రం ఎలాంటి ఆశ్చర్యం లేదన్నాడు. అలాగే మాజీ కెప్టెన్‌కెవిన్‌పీటర్సన్‌కూడా స్టోక్స్ నిర్ణయాన్నితప్పుపట్టాడు. పిచ్‌కండిషన్ బ్యాటింగ్‌కుఇంకా అనుకూలంగా మారుతుందన్నాడు. తొలిరోజు ఆటలో అలిసిపోయిన ఆసీస్ ఆటగాళ్లను బ్యాటింగ్‌కు ఆహ్వానించి వికెట్ తీయాలన్న ఆలోచనతో ఇంగ్లండ్ డిక్లేర్‌చేసింది. అయితే బ్యాడ్‌లైట్‌కారణంగా నాలుగు ఓవర్ల ఆటకే సాధ్యం కావడంతో ఆసీస్ 14/0తో తొలిరోజు ఆటను ముగించింది. రెండోరోజు ఆట ప్రారంభంలోనే డేవిడ్ వార్నర్ తొమ్మిదిపరుగులు, మార్నస్ లబుషేన్‌పరుగులు లేకుండానే ఔట్‌అయ్యారు. స్టువర్ట్‌బ్రాడ్ దెబ్బకు మార్నస్ లబుషేన్ గోల్డెన్ డకౌట్ కాగా వార్నర్ 18వ సారి ఆతని బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు.

# అహ్మదాబాద్ మ్యాచ్‌పై మీకేమిటి అభ్యంతరం?

## పిసిబి ఛైర్మన్‌పై షాహిద్ ఆఫ్రిదీ ఫైర్

**కరాచి:** వన్డేప్రపంచకప్‌కోసం తమ ప్రభుత్వం అనుమతిస్తేనే భారత్‌కువెళతామని పాక్ క్రికెట్‌బోర్డు ఛైర్మన్‌నజంసేథి ప్రకటించాడు. అలాగే అహ్మదాబాద్‌లో ఆడతామోలేదో కూడా ఇప్పుడే చెప్పలేమన్నాడు. అక్టోబరు15న ప్రపంచకప్‌లో భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌ఉంది. ఈక్రమంలో పిసిబి తీరుపై పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది తీవ్ర అసహనం వ్యక్తంచేసాడు. అహ్మదాబాద్ పిచ్‌పై ఎందుకు ఆడకూడదని అనుకుంటున్నారో మీరు చెపుతారా అదేమైనా నిప్పులు కురిపిస్తుందా లేకపోతే వేటాడుతుందా మీరువెళ్లి అక్కడ ఆడాలి విజయంసాధించాలి ఇవి మీరు ఊహించిన సవాళ్లు అయితే అక్కడికి వెళ్లి అద్భుతమైన విజయంసాధించి వాటిని అధిగమించాలి. భారత్‌ను వారి సొంతమైదానంలో ఓడించడానికి వచ్చిన అవకాశాలపై పిసిబి దృష్టిపెట్టాలి. అంతేకానీ వెనకడుగు వేయకూడదన్నాడు.

# ఆసియా కప్ టోర్నీపై ప్రోమో విడియో విడుదల!



**దుబాయ్:** ఆసియాకప్ 2023నిర్వహణకు మొత్తం సిద్ధం అయింది. ఆగస్టు 31నుంచి సెప్టెంబరు 17వరకూ ఆసియకప్ జరుగుతుంది. ఆరుదేశాలు పాల్గొనే ఈమినీ టోర్నీకి పాకిస్థాన్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. పాకిస్థాన్‌లో నాలుగు మ్యాచ్‌లు, శ్రీలంకలో తొమ్మిదిమ్యాయచ్‌లు చొప్పున హైబ్రిడ్‌మోడల్‌లో ఆసియా క్రికెట్‌మండలి నిర్వహిస్తోంది. టోర్నీ ప్రసారహక్కులు స్టార్‌స్పోర్ట్స్‌కు దక్యాఇ. ఆసియాకప్ థీమ్‌ను వివరిస్తూ ఇక విడియోప్రోమోనుకూడా ఎసిసి విడుదల చేసింది. ఈ ప్రోమో ఇపుడు నెట్టింట వైరల్ అవుతోంది. టీమిండియా ప్రయాణంతోపాటు ఆసియా దేశాల మినీ టోర్నీగురించి విడియోలో వివరించింది. ప్రపంచకప్‌కంటే ముందుజరిగే ఆసియాకప్‌ను కొట్టండి అంటూ భారత జట్టునుప్రోత్సహించింది. భారత్ పాకిస్థాన్ జట్లమధ్య పోరు ఆసక్తికరంగా ఉంటుందని ఎంజాయ్‌చేయండంటూ విడియోలో తెరవెనుక ఆడియోతో విడియోను ముగించింది.

# నేపాల్ సుంకంతో భారత్ దిగుమతులు నిలిపివేత



**న్యూఢిల్లీ, జూన్ 17:** పొరుగు దేశం నేపాల్ ప్రభుత్వం తీసు కున్న ఓ నిర్ణయం అక్కడి వ్యాపారుల ఆగ్రహానికి కారణమైంది. దిగుమతులపై 13శాతం విలువ ఆధారిత పన్ను విధిస్తూ సర్కారు తీర్మానించింది. దీంతో భారత్ నుంచి ఉల్లి పాయలు, బంగాళ దుం పలు, ఇతర కూరగాయల దిగుమతులు నిలిపి వేస్తున్న ట్లు నేపాల్ ట్రేడర్స్ తెలి పారు. నేపాల్ ప్రభుత్వ చర్యను అక్కడి ప్రతిపక్షాలు విమర్శించాయి. తక్కువ ఆదాయ వర్గాల ఆహార భద్రతను ఇది ప్రశ్నార్థకంగా మార్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే భారీగా పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో తీవ్రంగా దెబ్బ తిన్న ప్రజల వేదనను ఈ చర్య మరింత పెంచు తుందని వాదిస్తున్నారు. మే 29న పార్లమెంటులో ఇందుకు సంబంధించి బిల్లు ప్రవేశపెట్టడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆర్థిక మంత్రి ప్రకాశ్ శరణ్ మహత్ ఈ చర్యను సమర్థించారు. స్థానిక రైతులను ఆదుకోవ డానికి, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతేడాది భారత్ నుంచి దాదాపు 1,74,000 టన్నుల ఉల్లిపాయలను నేపాల్ దిగుమతి చేసుకుంది. స్థానిక డిమాండ్‌లో 60శాతం బంగాళా దుంపలను అక్కడే పండిస్తుండగా, మిగిలినవి భారత్ నుంచి దిగుమతి చేసుకుం టోంది.

# భారతీయ ఐటి సంస్థలకు జెపి మోర్గాన్ రివర్స్ రేటింగ్



**ముంబై, జూన్ 17:** ఐటి రంగంలో వెలుగొందుతున్న భారతీయ దిగ్గజ కంపెనీలు అతి త్వరలో గడ్డు పరిస్థితిని ఎదుర్కోబోతున్నాయని విశ్లేషణలు వెలువడుతున్నాయి. గ్లోబల్ ఎకానమీలో మందగమనం వల్ల కొత్త వ్యాపారాలను చేజిక్కించుకోవడంలో ఇండియన్ ఐటి సేవల కంపెనీలకు ఎదురుదెబ్బ తప్పదంటూ షాక్ ఇచ్చింది. భారతీయ ఐటి సేవల కంపెనీలకు తగ్గుతున్న డిమాండ్ కారణంగా, జూన్‌లో ఆయా సంస్థలపై ప్రతికూల అభిప్రాయాన్ని కొనసాగించాలని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ జెపి మోర్గాన్ నిర్ణయించింది. తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రాజెక్టులను కస్టమర్లు పునఃప్రారంభించేందుకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. తద్వారా రాబోయే 9నెలల్లో వృద్ధిని ఆశించడం కష్టమేనని వెల్లడించింది. జెపి మోర్గాన్ ప్రతికూల వాచ్ లిస్ట్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, ఎంఫసిస్‌లు ఉన్నాయి. అందువల్ల 2024 మొదటి త్రైమాసికంలో ఈ 3 కంపెనీల ఆదాయాలు, మార్జిన్లు పెట్టుబడిదారులను నిరాశపరుస్తాయని భావిస్తున్నారు. టిసిఎస్ 3శాతం, ఇన్ఫోసిస్ మరియు ఎంఫసిస్ 4శాతం మేర రాబడి కోల్పోవచ్చని అంచనా. దీనిని బట్టి చూస్తే రాబోయే 9 నెలల వరకు ఐటి ఉద్యోగార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అర్థం చేసుకోవాలి. ఆయా కంపెనీల వ్యాపారం మందకొడిగా సాగుతున్న వేళ ఖర్చులను తగ్గించుకోవడానికి అవి ప్రయత్నిస్తాయి.

# మణప్పురం ఫైనాన్స్‌కు ఆర్‌బిఐ రూ.20 లక్షల పెనాల్టీ



**న్యూఢిల్లీ, జూన్ 17:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మణప్పురం ఫైనాన్స్‌కు షాకి చ్చింది. మణప్పురం ఫైనాన్స్‌కు భారీ జరిమానా విధించింది. ప్రజలకు రుణా లు అందించేందుకు ఈ సంస్థ పని చేస్తోంది. నిబంధనలను ఉల్లంఘించినందుకు రిజర్వ్ బ్యాంకు ఈ జరిమానా విధించింది. గోల్డ్ లోన్ కంపెనీకి రెగ్యులేటరీ సమ్మతి లోపాల కారణంగా మణప్పురం ఫైనాన్స్‌పై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.20 లక్షల జరిమానా విధించింది. ఎన్‌బిఎఫ్‌సి నిబంధనలలోని కొన్ని నిబంధన లను పాటించనందుకు ఆర్‌బిఐ రూ.20 లక్షల జరిమానా విధిం చింది. ఈ సందర్భంగా ఎలాంటి లావాదేవీలను ప్రభావితం చేయకూడదని రిజర్వ్ బ్యాంకు స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంకు మార్చి 2021లో మణప్పురం ఫైనాన్స్ తనిఖీని నిర్వహించింది. దీని తర్వాత కంపెనీ స్థితిగతులపై పూర్తి నివేదికను రూపొందించి ఆదేశాలు ఇచ్చారు. ఈ తనిఖీ లో కంపెనీనిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిం ది. దీని కారణంగా సెంట్రల్‌బ్యాంకు కంపెనీపై జరి మానా విధించింది. అదే సమయంలో 90 రోజుల కుపైగా బకాయి ఉన్న గోల్డ్‌లోన్ ఖాతాను వేరు చేయాలని కంపెనీకి ఆర్‌బిఐ స్పష్టం చేసింది. 2011 నుంచి కొన్ని ఖాతాలల్లోని మొత్తానికి తప్పనిసరి రుణ నిర్వహణను కూడా కంపెనీ నిర్ధారించ లేదని సెంట్రల్ బ్యాంకు తెలిపింది. దీనితోపాటు రిజర్వ్ బ్యాంకు అనేక ఇతర సమస్యలనుగుర్తించింది. దీనిపై కంపెనీ సరైన సమాధానం ఇవ్వక పోవడంతో ఈచర్య తీసుకున్నట్లు ఆర్‌బిఐ తెలిపింది. భారతీయ రిజర్వ్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల ఆర్థిక పరిస్థితిని, నిబంధనల ఉల్లంఘనలను ఎప్పటి కప్పుడు తనిఖీచేస్తూనే ఉంటుంది. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థ ల్లో ఏదైనా సమస్యను గుర్తిస్తే, జరిమానా లేదా నిషేధానికి సంబంధించిన చర్య తీసు కునే అధికారం ఆర్‌బిఐకి ఉంది.

# బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులపై సిబిఐ వేటు

వాణిజ్యం

**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్‌ను మోసం చేసినందుకు బిఎస్‌ఎన్‌ఎల్ మాజీ జనరల్ మేనేజర్ సహా 21 మంది అధికారులపై సిబిఐ ఇటీవల ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, హర్యానాలోని నిందితుల కార్యా లయాలు, నివాసాలతో పాటు 25 చోట్ల సిబిఐ సోదాలు నిర్వహిం చిందని అధికారులు తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు ఒక కాంట్రాక్టర్‌తో కలిసి కుట్ర పన్ని సంస్థను మోసం చేయాలని చూసి నట్లు సిబిఐ ప్రాథమిక ఆరోపణ. జోర్హాట్, సిబ్‌సాగర్, గౌహతి, ఇతర ప్రాంతా లలో మాజీ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌తో సహా బిఎస్‌ఎన్‌ఎల్ అస్సోంసర్కిల్ అధికారులపై సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది.

# అదానీ చేతికి ట్రైన్‌మ్యాన్

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఆన్‌లైన్ ట్రైన్ బుకింగ్, ఇన్ఫర్మేషన్ పోర్టల్ ట్రైన్‌మ్యాన్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కు చెందిన అనుబంధ సంస్థ అదానీ డిజిటల్ ల్యాబ్స్ ఈ స్టార్టప్‌ను దక్కించు కుంది. ఈ మేరకు అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. 100శాతం వాటా కొనుగోలుకు షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు తెలిపింది. అయితే ఎంతకు కొనుగోలు చేసిందీ వెల్లడించలేదు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.